


మానేరు
# జనత®
తెలుగు దినపత్రిక ఇది జనం గొంతుక

26.1.2026 సోమవారం Monday | సంపుటి (Volume): 10 సంచిక (Issue) : 277 | పేజీలు : 8 Pages : 8 | వెల : 2 | Published from : Karimnagar

సమస్య ఏదైనా
జనం కోసం జనతా..
ఇదే మా ఆహ్వానం
ప్రజలు, ప్రభుత్వానికి మధ్య వారధి మీడియా
ప్రజా సమస్యలను వెలికితీసి..
వాటి పరిష్కారానికి పునాది వేసేది మీడియా
మీ సమస్య ఏదైనా మీ తరుపున నిలబడి
అటు అధికారులను గానీ, ఇటు రాజకీయ నాయకులను గానీ
నిలదీస్తూ, నిజాన్ని నిగ్గు తేలుస్తుంది జనతా..
రండి..మీ కలాన్ని కదపండి..
మీ గళాన్ని వినిపించండి.
అందరం కలిసికట్టుగా..
"జనతా"తో కలిసి ప్రజా సమస్యలపై పోరాడుదాం..!!
మొక్కవోని దీక్షతో పని చేద్దాం.. తగ్గేదేలే..!
జనం కోసం "జనతా"..
శుభాకాంక్షలు..
సంప్రదించాల్సిన మొబైల్ నంబర్.. 7989867251
- ఎడిటర్




# విరిసిన పద్మాలు!

## ప్రఖ్యాత క్యాన్సర్ వైద్య నిపుణుడు.. దత్తాత్రేయుడుకు పద్మ భూషణ్



- నటులు మురళీ మోహన్, రాజేంద్ర ప్రసాద్‌కు పద్మశ్రీ
- గరిమెళ్ల బాలకృష్ణప్రసాద్‌కు మరణానంతరం పురస్కారం
- తెలంగాణకు చెందిన ప్రముఖ వైద్యులు విజయ్ ఆనంద్ రెడ్డి, జీవీ రావు, డీఆర్డీవో మాజీ సైంటిస్ట్ చంద్రమౌళి, కూచిపూడి నృత్య కళాకారిణి దీపికారెడ్డిలకు పద్మశ్రీ
- పశుపోషణ నిపుణుడు ఎం.రామారెడ్డికి మరణానంతరం!
- 2026 పద్మ పురస్కారాలను ప్రకటించిన కేంద్ర ప్రభుత్వం
- 5 పద్మవిభూషణ్, 13 పద్మభూషణ్, 113 పద్మశ్రీ అవార్డులు
- ఏపీ నుంచి నలుగురు.. తెలంగాణ నుంచి ఏడుగురికి!
- పురస్కార గ్రహీతలకు అభినందనలు తెలిపిన ప్రధాని




3



## శుభాన్షు శుక్లాకు అశోక చక్ర

- అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రానికి వెళ్లిన తొలి భారతీయుడు, వైమానిక దళ గ్రూప్ కెప్టెన్
- గగన్‌యాన్ మిషన్‌లో భాగమైన గ్రూప్ కెప్టెన్ బాలకృష్ణన్ నాయర్‌కు కీర్తిచక్ర అవార్డు

3

# అందరి చూపూ మనవైపే

## స్వదేశీకి ప్రపంచం ఫిదా



- స్వదేశీ ఉత్పత్తుల్లో నాణ్యతకు పెద్ద పీట వేద్దాం
- నాణ్యమైన ఉత్పత్తుల కోసం భారత్ వైపు ప్రపంచం చూపు
- మన వస్తువులు గ్లోబల్ మార్కెట్లో దుమ్ము రేపుతున్నాయి
- ఏదైనా కొనేటప్పుడు భారత్లో తయారైందా అని అడగండి
- జెన్ జెడ్లో భజన్ క్లబ్బింగ్ ట్రెండ్.. ఇది యువత ఆధ్యాత్మిక ఉద్యమం
- ఓటు వేయడం ప్రతి ఒక్కరి బాధ్యత.. మన్ కీ బాత్‌లో ప్రధాని మోడీ
- ఓటరు దినోత్సవాన యువతకు ప్రధాని లేఖ

స్వదేశీ ఉత్పత్తుల్లో నాణ్యతకు పెద్ద పీట వేయాలని ప్రధాని నరేంద్ర మోడీ పిలుపునిచ్చారు. ఆదివారం ప్రసార మైన మన్ కీ బాత్ 130వ ఎపిసోడ్లో ప్రసంగిస్తూ చూస్తున్నా రా మిత్రులారా... ఇండియాలో తయారైన వస్తువులు ఇప్పుడు ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు పొందుతు న్నాయి. మన దేశంలో తయారైన వస్తువులకు డిమాండ్ పెరుగుతోంది. ఇది కేవలం ఆర్థిక ప్రగతి మాత్రమే కాదు. ఇది మన స్వాభిమానం, మన స్వతంత్రత కూడా. మనం వోకల్ ఫర్ లోకల్ అని అన్నాం కదా. ఇప్పుడు అది వోకల్ ఫర్ లోకల్ నుంచి గ్లోబల్ ఫర్ లోకల్ గా మారుతోంది. మన భారతీయ ఉత్పత్తులను కొనాలని ప్రపంచం ఆశపడుతోంది. మన బ్రాండ్లు, మన స్టార్టప్లు, మన యువత తయారు చేస్తున్న వస్తువులు ఇప్పుడు గ్లోబల్ మార్కె ట్లో దుమ్ము రేపుతున్నాయి.

4లో..



## ఫిబ్రవరి రెండో వారంలో పురపాలక ఎన్నికలు

త్వరలో షెడ్యూల్ విడుదలకు అవకాశం: మంత్రి ఉత్తమ్

.. వివరాలు 2లో



## నీటి గుంతలో పడి ముగ్గురు చిన్నారుల మృతి

పొలం వద్ద సెల్ఫీలు దిగుతూ ..

- మృతులందరూ ఒకే కుటుంబానికి చెందిన వారు
- నాగర్‌కర్నూల్ జిల్లా ముచ్చర్లపల్లిలో విషాదం

.. వివరాలు 2లో

# పెను విషాదం మిగిల్చిన అగ్నిప్రమాదం

మంటల్లో చిక్కుకున్న ఇద్దరు చిన్నారులు సహా ఐదుగురి మృతదేహాల గుర్తింపు



- పూర్తిగా కమిలిపోయిన మృతదేహాలు
- 20 గంటల పాటు రెస్క్యూ ఆపరేషన్
- ఉస్మానియాలో పోస్టుమార్టం పూర్తి
- అంబులెన్సుల్లో స్వగ్రామాలకు తరలింపు
- బాధిత కుటుంబాలకు 5 లక్షల చొప్పున ఎక్స్‌గ్రేషియా ప్రకటించిన ప్రభుత్వం
- దుకాణ యజమాని అరెస్టు, రిమాండ్
- భవనాన్ని సీజ్ చేసిన జీహెచ్ఎంసీ

## భూ రికార్డులపై భరోసా కల్పించేలా సర్వేయర్లు పని చేయాలి

ధరణి అవకతవకలపై రాష్ట్రవ్యాప్తంగా ఫోరెన్సిక్ ఆడిట్

- విడతల వారీగా భూ సర్వే పూర్తి చేసేందుకు కార్యాచరణ సిద్ధం
- నాంపల్లి అగ్నిప్రమాద బాధితులకు ఒక్కొక్కరికి రూ.5 లక్షల పరిహారం
- లైసెన్స్డ్ సర్వేయర్లకు ధృవీకరణ పత్రాల పంపిణీ

భూ రికార్డులపై రైతులకు, భూ యజమానులకు భరోసా కల్పించేలా సర్వేయర్లు నిష్పక్షపాతంగా పని చేయాలని రాష్ట్ర రెవెన్యూ, హౌజింగ్, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి అన్నారు. ధరణి వ్యవస్థలో జరిగిన అవకతవకలపై రాష్ట్రవ్యాప్తంగా ఫోరెన్సిక్ ఆడిట్ చేపట్టామని, భూ సర్వేను విడతల వారీగా పూర్తి చేసేందుకు సమగ్ర కార్యాచరణ సిద్ధం చేశామని తెలిపారు.





## పెద్దచేపకు లాభం కోసమే గుంటనక్క కుట్రలు

గుంపు మేస్త్రికి అనుకూలంగా గుంటనక్క!

- బీఆర్ఎస్ హయాంలో ఎక్సైజ్‌కు టెండర్లు వేయలేదా?
- గుంటనక్క వాటాలు తేలకనే అలా మాట్లాడుతున్నారు
- మహేశ్‌గౌడ్ జాగృతిలోకి వస్తే జాతీయ కన్వీనర్‌ను చేస్తా!
- మీడియాతో కల్వకుంట్ల కవిత
- ఆ నక్కను అనుసరిస్తూ గుంతలో పడ్డ కేటీఆర్

బీఆర్ఎస్‌లోనే ఉంటూ కేసీఆర్‌కు ద్రోహం చేయాలని గుంటనక్క చూస్తోందని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవిత ఆరోపించారు. అందులో భాగంగానే పార్టీలో కొనసాగుతూ గుంపు మేస్త్రికి అనుకూలంగా ఉంటోందన్నారు. ఆ గుంటనక్కను అనుసరిస్తూ కేటీఆర్ గుడ్డిగా గుంతలో పడ్డారని చెప్పారు.

వివరాలు 3లో



## నైనీ పెద్ద సమస్య కాదు

- రాజకీయాలకతీతంగా సింగరేణి కోసం పని చేస్తాం
- కార్మికుల రక్తం తాగుతున్న బీఆర్ఎస్, కాంగ్రెస్
- కేసీఆర్ అవినీతి వల్లే జీతాలివ్వలేని దుస్థితి
- ప్రైవేటీకరణ ఎప్పటికీ జరగదు: కిషన్‌రెడ్డి

2

# నైనీ పెద్ద సమస్య కాదు

## రాజకీయాలకతీతంగా సింగరేణి కోసం పని చేస్తాం

**కార్మికుల రక్తం తాగుతున్న బీఆర్ఎస్, కాంగ్రెస్**

**కేసీఆర్ అవినీతి వల్లే జీతాలివ్వలేని దుస్థితి**

**ప్రైవేటీకరణ ఎప్పటికీ జరగదు: కిషన్‌రెడ్డి**



**కొత్తగూడెం, జనవరి 25 :** నైనీ బొగ్గు బ్లాకు అంశం పెద్ద సమస్య కాదని, దానిని పరిష్కరిస్తామని కేంద్ర బొగ్గు, గనుల శాఖమంత్రి కిషన్‌రెడ్డి స్పష్టం చేశారు. రాజకీయాలను పక్కన పెట్టి నైనీ విషయంలో సింగరేణి ప్రయోజనాల కోసం పని చేస్తామని చెప్పారు. నైనీ టెండర్లకు సంబంధించి ఇప్పటికే దర్యాప్తు కమిటీ వేయగా.. ఢిల్లీకి వెళ్లిన అనంతరం ఆ నివేదికను పరిశీలిస్తామన్నారు. ఆదివారం ఆయన కొత్తగూడెం కోల్‌బెల్ట్‌లో పర్యటించారు. రుద్రంపూర్‌లోని పీవీకే-5 ఇంక్లైన్ గనిని సందర్శించి కార్మికులతో మాట్లాడారు. కొత్తగూడెంలోని సింగరేణి ఇల్లెందు అతిథి గృహంలో కార్మిక సంఘాల నేతలతో భేటీ అయ్యారు. అనంతరం కొత్తగూడెం క్లబ్‌లో జరిగిన బీజేపీ మునిసిపల్ ఎన్నికల విజయసంకల్ప సభలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా కిషన్‌రెడ్డి మాట్లాడారు. బీఆర్ఎస్, కాంగ్రెస్ సింగరేణి కార్మికుల రక్తం తాగుతున్నాయని మండిపడ్డారు. కేసీఆర్ కుటుంబమంతా సింగరేణిని దోచుకుందని ఆరోపించారు. బ్యాంకుల నుంచి అప్పు తెచ్చి కార్మికులకు జీతాలిచ్చే పరిస్థితికి కేసీఆర్ అవినీతి పాలనే కారణమని విమర్శించారు. ఫుట్‌బాల్ ఆటగాడు మెస్సీ వస్తే రూ.10 కోట్లు సింగరేణి నుంచి ఖర్చు పెట్టారని, ఫుట్‌బాల్‌కు సింగరేణికి ఏం సంబంధమని ప్రశ్నించారు. సంస్థకు చెందిన రూ.51 కోట్లను ప్రభుత్వం వాడుకొని తిరిగి ఇవ్వకపోవడంతో సింగరేణి ఆర్థిక సంక్షోభంలోకి వెళ్లిందన్నారు. సింగరేణి ప్రైవేటీకరణ జరుగుతోందని కొందరు తప్పుడు ప్రచారం చేస్తున్నారని, అది ఎప్పటికీ జరగదని కిషన్‌రెడ్డి అన్నారు. సింగరేణిలో ఖర్చు తగ్గించుకుని, ఉత్పత్తిని పెంచుకోవాల్సిన ఆవశ్యకత ఉందన్నారు. 35వేల మంది కాంట్రాక్టు కార్మికుల జీతాలు పెంచడంతోపాటు, సింగరేణికి రావాల్సిన బకాయిల వసూళ్ల విషయంపై ముఖ్యమంత్రికి లేఖ రాస్తానని హామీ ఇచ్చారు. కాగా, ఖమ్మం ఎంపీ రఘురామరెడ్డి కొత్తగూడెంలో విమానాశ్రయ ఏర్పాటు అంశంపై కిషన్‌రెడ్డితో చర్చించారు. కోల్ ఇండియా తరహా వేతన చట్టాన్ని అమలు చేయాలని కాంట్రాక్ట్ కార్మిక సంఘాల నాయకులు కిషన్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో ఎక్కడిక్కడ తెలంగాణను దోచుకున్నారని కిషన్‌రెడ్డి విమర్శించారు. దోచుకున్నసొమ్మును పంచుకునేందుకు కొట్లాడుకుంటూ కేసీఆర్‌కుటుంబం రోడ్డున పడిందన్నారు. ప్రస్తుత కాంగ్రెస్ సైతం బీఆర్ఎస్ మాదిరిగా ఎక్కడపడితే అక్కడ దోచుకుంటోందని విమర్శించారు.

# ఫిబ్రవరి రెండో వారంలో పురపాలక ఎన్నికలు

**త్వరలో షెడ్యూల్ విడుదలకు అవకాశం: మంత్రి ఉత్తమ్**



**నిజామాబాద్/మెట్‌పల్లి టౌన్, జనవరి25 :** ఫిబ్రవరి రెండో వారంలో పురపాలక ఎన్నికలు జరిగే అవకాశాలు ఉన్నాయని, త్వరలో షెడ్యూల్ విడుదలవుతుందని మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. పురపాలక ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అధిక స్థానాలు గెలుచుకుంటుందని ధీమా వ్యక్తం చేశారు. మునిసిపల్ ఎన్నికల నేపథ్యంలో ఆదివారం నిజామాబాద్‌లో పీసీసీ అధ్యక్షుడు మహేష్‌గౌడ్‌తో కలిసి కాంగ్రెస్ ముఖ్య నాయకుల సమావేశంలో ఉత్తమ్ పాల్గొన్నారు. అనంతరం జగిత్యాల జిల్లా మెట్‌పల్లిలో మీడియాతోనూ ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో గత రెండేళ్లుగా చేస్తున్న అభివృద్ధి కార్యక్రమాలే రాబోయే మునిసిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని గెలిపిస్తాయన్నారు. చేసిన అభివృద్ధి పనులు వివరిస్తూ ముందుకెళ్లాలని, టికెట్ ఎవరికి వచ్చినా అందరూ కలిసి పనిచేస్తే పార్టీ అన్ని మునిసిపాలిటీలను, కార్పొరేషన్‌లను గెలుచుకుంటుందని చెప్పారు. సర్వేల ఆధారంగా అభ్యర్థులకు టికెట్లు ఇస్తామని, పార్టీ గెలుపులో భాగస్వాములైన ప్రతి ఒక్కరికి భవిష్యత్తులో సముచిత స్థానం కల్పిస్తామని పేర్కొన్నారు. ఎక్కడాలేనివిధంగా తెలంగాణలో పేదలకు సన్నబియ్యం అందిస్తున్న ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానిదన్నారు.

# అధికారులపై దాడులు చేస్తే ఉపేక్షించం

**కానిస్టేబుల్‌పై గంజాయి స్మగ్లర్ల దాడి హేయం: జూపల్లి**



**హైదరాబాద్, జనవరి 25 :** గంజాయి అక్రమ రవాణాను అడ్డుకునే క్రమంలో ఎక్సైజ్ సిబ్బందిపై జరుగుతున్న దాడులను ప్రభుత్వం అత్యంత సీరియస్‌గా తీసుకుంటుందని ఎక్సైజ్‌శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు స్పష్టం చేశారు. నిజామాబాద్ జిల్లాలో గంజాయి స్మగ్లర్లు కారుతో ఢీ కొట్టిన ఘటనలో తీవ్రంగా గాయపడి నిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న ఎక్సైజ్ కానిస్టేబుల్ సౌమ్య ఆరోగ్య పరిస్థితిపై మంత్రి ఆదివారం ఆరా తీశారు. నిమ్స్ డైరెక్టర్‌తో ఫోన్‌లో మాట్లాడి.. మెరుగైన వైద్యం అందించాలని సూచించారు. విధి నిర్వహణలో గాయపడిన సౌమ్యకు ప్రభుత్వం అండగా ఉంటుందని స్పష్టం చేశారు. విధి నిర్వహణలో ఉన్న అధికారులపై దాడులకు పాల్పడేవారిని ఉపేక్షించే ప్రసక్తే లేదని, చట్ట ప్రకారం కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

# పెను విషాదం మిగిల్చిన అగ్ని ప్రమాదం

**పెను విషాదం మిగిల్చిన నాంపల్లి ఫర్నిచర్ దుకాణంలో అగ్ని ప్రమాదం**

**పూర్తిగా కమిలిపోయిన మృతదేహాలు**

**20 గంటల పాటు రెస్క్యూ ఆపరేషన్**

**ఉస్మానియాలో పోస్టుమార్టం పూర్తి**

**అంబులెన్సుల్లో స్వగ్రామాలకు తరలింపు**

**బాధిత కుటుంబాలకు 5 లక్షల చొప్పున ఎక్స్‌గ్రేషియా ప్రకటించిన ప్రభుత్వం**

**దుకాణ యజమాని అరెస్టు, రిమాండ్**

**భవనాన్ని సీజ్ చేసిన జీహెచ్ఎంసీ**



**హైదరాబాద్, జనవరి 25 :** హైదరాబాద్‌లోని ఓ ఫర్నిచర్ దుకాణంలో శనివారం చోటుచేసుకున్న భారీ అగ్ని ప్రమాదంలో మంటల్లో చిక్కుకున్న ఇద్దరు చిన్నారులు సహా ఐదుగురు అగ్నికి ఆహుతి అయ్యారు. ఆదివారం మంటలు అదుపులోకి వచ్చిన తర్వాత సెల్లార్‌లో పూర్తిగా కమిలిపోయిన వారి మృతదేహాలను గుర్తించారు. ఈ ప్రమాదంలో వాచ్‌మేన్ పిల్లలు ప్రణీత్ (12), అఖిల్ (8), వారిని కాపాడేందుకు వెళ్లిన అదే దుకాణంలో పనిచేసే ఇంతిజాయ్ (26), హబీబ్ (30), స్వీపర్ బీబీ (50) మరణించారు. నాంపల్లిలోని చీరాగ్ గల్లీలో ఉన్న బచాస్ ఫర్నిచర్ క్యాసిల్ అనే దుకాణంలో శనివారం మధ్యాహ్నం అగ్ని ప్రమాదం సంభవించిన సంగతి తెలిసిందే. సెల్లార్‌లో ఉన్న ఫర్నిచర్ గోదాములో రేగిన మంటలు భవనంలోని మొత్తం నాలుగు అంతస్తులకు వ్యాపించాయి. వాచ్‌మేన్ యాదయ్య కుటుంబంతో పాటు బీబీ కుటుంబం కూడా సెల్లార్‌లోని గదుల్లో ఉంటున్నారు. యాదయ్య, లక్ష్మి దంపతులు బయటకు వెళ్లగా ప్రణీత్, అఖిల్ సెల్లార్‌లోని తమ గదిలో ఉన్నారు. బీబీ కూడా సెల్లార్‌లోనే ఉంది. సెల్లార్‌లో ఉన్నట్టుండి మంటలు వారి కేకలు విని ఇంతియాజ్, హబీబ్‌లు వారిని కాపాడేందుకు వెళ్లారు. ఐదుగురూ మంటల్లో చిక్కుకుని మరణించారు. శనివారం మధ్యాహ్నం నుంచి 20 గంటల పాటు రెస్క్యూ ఆపరేషన్ నిర్వహించాల్సి వచ్చిందని, ఆదివారం మంటలు పూర్తిగా అదుపులోకి వచ్చిన తర్వాత ఉదయం 9 గంటలకు ఒకటి, 11 గంటలకు మరొకటి, తర్వాత వెంటవెంటనే ముగ్గురి మృతదేహాలను గుర్తించి వెలికితీశామని అగ్నిమాపక శాఖ డీజీ విక్రమ్ సింగ్ మాన్ తెలిపారు. సెల్లార్‌లో ర్యాంపు వద్ద మహిళతో పాటు ఆమెను కాపాడటానికి వెళ్లిన ఇంతియాజ్ మృతదేహం లభించగా.. వాచ్‌మెన్ రూమ్‌లో ఇద్దరు చిన్నారులతో పాటు వారిని రక్షించేందుకు వెళ్లిన హబీబ్ మృతదేహం లభించింది. తమ ఇద్దరు పిల్లలు స్కూల్‌కు వెళ్లి ఉంటే బతికేవారని యాదయ్య, లక్ష్మి దంపతులు గుండెలవిసేలా రోదించారు. యాదయ్య కుటుంబం ఇబ్రహీంపట్నం మాల్ మర్రిగూడ నుంచి బతుకుదెరువు కోసం ఇక్కడికి వచ్చింది. మరో మృతుడు నాంపల్లి సుభాన్‌పురాకు చెందిన ఇంతియాజ్ పదిహేనేళ్లుగా ఈ ఫర్నిచర్‌దుకాణంలో ట్రాన్స్‌పోర్ట్ లిఫ్టర్‌గా పనిచేస్తున్నాడు. శాస్త్రిపురానికి చెందిన హబీబ్ ఇదే దుకాణంలో ఆటోడ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. కర్ణాటక రాష్ట్రం గుల్బర్గాకు చెందిన బీబీ గత పదేళ్లుగా ఇదే షాపులో స్వీపర్‌గా పనిచేస్తోంది. ఆమె కొడుకు సమీర్ మరో వాచ్‌మెన్‌గా పనిచేస్తున్నాడు. చనిపోయిన వారి మృతదేహాలను ఉస్మానియా మార్చురీకి తరలించారు. పోస్టుమార్టం అనంతరం కుటుంబ సభ్యులకు అప్పగించి, ప్రభుత్వ అంబులెన్సుల్లో స్వగ్రామాలకు పంపించారు. ఈ సమయంలో ఇద్దరు చిన్నారుల మృతదేహాలను తరలిస్తున్న అంబులెన్స్‌ను కుటుంబ సభ్యులు, బంధువులు అడ్డుకుని ధర్నా నిర్వహించారు. రూ.5 లక్షల ఎక్స్‌గ్రేషియా ప్రకటించి చేతులు దులుపుకోవడం సరికాదన్నారు. చిన్నారులను చూడడానికి మంత్రులెవరూ రాకపోవడం విచారకరమన్నారు.

### దుకాణ యజమాని అరెస్ట్

యాదయ్య ఇచ్చిన ఫిర్యాదుపై ఫర్నిచర్ షాపు యజమాని సతీష్ బచ్చ్ సను అరెస్ట్ చేశామని అబిడ్స్ ఏసీపీ ప్రవీణ్‌కుమార్ తెలిపారు. ఈ ప్రమాదం షార్ట్ సర్క్యూట్ వల్ల జరిగినట్లు ప్రాథమికంగా నిర్ధారించామన్నారు. మృతుల కుటుంబాలకు రూ. 5లక్షల చొప్పున ఎక్స్‌గ్రేషియా అందిస్తామని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, హైదరాబాద్ జిల్లా ఇన్‌చార్జి మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రకటించారు. ప్రమాదంలో చిక్కుకున్నవారిని రక్షించేందుకు వెళ్లిన సయ్యద్ మొయినుద్దీన్‌కు కాళ్లు, చేతులకు గాయాలవడంతో ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. కాగా, ఫర్నిచర్ దుకాణం నిర్వహిస్తున్న భవనాన్ని జీహెచ్ఎంసీ అధికారులు సీజ్ చేశారు.

# నీటి గుంతలో పడి ముగ్గురు చిన్నారుల మృతి

**పొలం వద్ద సెల్ఫీలు దిగుతూ ..**

**మృతులందరూ ఒకే కుటుంబానికి చెందిన వారు**

**నాగర్‌కర్నూల్ జిల్లా ముచ్చర్లపల్లిలో విషాదం**



**ఊర్కొండ, జనవరి 25 :** పొలం వద్ద ఫొటోలు దిగుతూ నీటి గుంతలో పడి ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు చిన్నారులు ప్రాణాలు కోల్పోయారు. ఈ విషాద సంఘటన నాగర్‌కర్నూల్ జిల్లా ఊర్కొండ మండలంలోని ముచ్చర్లపల్లి గ్రామంలో ఆదివారం చోటు చేసుకుంది. అదే గ్రామానికి చెందిన మాధు శ్రీకాంత్‌రెడ్డి కుటుంబంతో కలిసి హైదరాబాద్‌లోని తుర్కయాంజల్‌లో నివసిస్తున్నారు. అనారోగ్యంతో బాధపతున్న తన తల్లి సరస్వతమ్మను చూసేందుకు భార్య రజని, కుమారుడు శ్రీమాన్య (12), కుమార్తె శ్రీకృతి (సిరి) (14), సోదరి చంద్రకళ, ఆమె కుమార్తె ఎడ్మ స్నేహ (17)లతో కలిసి శనివారం స్వగ్రామానికి వచ్చారు. ఆదివారం పిల్లలందరూ శ్రీకాంత్‌రెడ్డితో కలిసి సమీపంలోని పొలానికి వెళ్లారు. అక్కడున్న నీటి గుంత పక్కన పిల్లలు ఆడుకుంటూ ఫొటోలు దిగుతున్నారు. ఈ క్రమంలో శ్రీమాన్య ప్రమాదవశాత్తు కాలుజారి గుంతలో పడిపోయాడు. అతడిని కాపాడే యత్నంలో సిరి, స్నేహ కూడా నీటిలో మునిగిపోయారు. వారిని కాపాడేందుకు శ్రీకాంత్‌రెడ్డి సోదరుడి కుమార్తె మాధు విద్యాధరణి కూడా గుంతలోకి దిగి భయంతో పెద్దగా కేకలు వేసింది. దీంతో శ్రీకాంత్‌రెడ్డి అక్కడికి చేరుకొని విద్యాధరణిని బయటకు లాగేశారు. ఆయనకు ఈత రాకపోవడంతో గుంతలో మునిగిన ముగ్గురిని కాపాడలేక నిస్సహాయ స్థితిలో ఉండిపోయారు. పరిసర ప్రాంత రైతులు అక్కడికి చేరుకొని ముగ్గురినీ బయటకు తీయగా అప్పటికే వారు మృతి చెందారు. మృతదేహాలను పోలీసులు కల్వకుర్తి ప్రభుత్వాస్పత్రికి తరలించి, పోస్టుమార్టం అనంతరం కుటుంబ సభ్యులకు అప్పగించారు. కేసు నమోదు చేసినట్లు ఎస్సై కృష్ణదేవ తెలిపారు. శ్రీమాన్య ఆరో తరగతి, శ్రీకృతి ఎనిమిదో తరగతి, స్నేహ ఇంటర్మీడియట్ లపథమ సంవత్సరం చదువుతున్నారు. ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు పిల్లలు మృతి చెందడంతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. జడ్చర్ల ఎమ్మెల్యే జనంపల్లి అనిరుధ్‌రెడ్డి ఆసుపత్రిలో బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు.

# మనాలీలో పర్యాటకుల నరకయాతన

**గడ్డకట్టే చలిలో 24 గంటలకు పైగా ట్రాఫిక్ జామ్**



**సిమ్లా/మనాలీ, జనవరి 25:** హిమాచల్‌ప్రదేశ్ మంచులో ప్రకృతి అందాలను వీక్షించేందుకు వచ్చిన వేలాది మంది పర్యాటకులు గడ్డకట్టే చలిలో ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని గడుపుతున్నారు. వరుస సెలవులు రావడంతో పర్యాటకుల రద్దీ అనూహ్యంగా పెరిగింది. ఫలితంగా రాష్ట్రవ్యాప్తంగా రవాణా వ్యవస్థ పూర్తిగా స్తంభించిపోయింది. ముఖ్యంగా మనాలీ, సిమ్లా వంటి పర్యాటక ప్రాంతాల్లో వాహనాలు 24గంటలకు పైగా ట్రాఫిక్ జామ్‌లో చిక్కుకుపోయాయి. రోడ్లపై సుమారు 7-8 కిలోమీటర్ల మేర వాహనాలు నిలిచిపోవడంతో పర్యాటకులు మైనస్ డిగ్రీల చలిలో వాహనాల్లోనే బిక్కుబిక్కుమంటూ గడిపారు. పెట్రోల్ అయిపోతుందనే భయంతో చాలా మంది వాహనాల్లోని హీటర్లు ఆపేసి, రోడ్డు పక్కనే చలిమంటలు వేసుకుని వెచ్చదనం పొందారు. చైల్ వంటి మార్గాల్లో చిక్కుకున్న వారికి కనీసం ఆహారం, నీరు కూడా అందుబాటులో లేక ఇబ్బందులు పడ్డారు. దీంతో కొందరు వాహనాలను అక్కడే వదిలేసి, కిలోమీటర్ల కొద్దీ మంచులో నడుచుకుంటూ వెళ్లారు. రాష్ట్రవ్యాప్తంగా దాదాపు 685 రహదారులు మూతపడినట్లు అధికారిక లెక్కలు చెబుతున్నాయి. మరోవైపు, మనాలీలోని హోటళ్లన్నీ పర్యాటకులతో నిండిపోవడంతో కొత్త వారికి ఆశ్రయం దొరకడం లేదు. మరో 3 రోజులు పరిస్థితి మరింత తీవ్రంగా ఉంటుందని వాతావరణ శాఖ హెచ్చరించింది. పర్యాటకులు అత్యవసరమైతే తప్ప బయటకు రావొద్దని కోరింది.

# మేడారం ఏర్పాట్లను క్షేత్రస్థాయిలో పర్యవేక్షించిన మంత్రి సీతక్క

**చిలకలగుట్ట, ట్రైబల్ మ్యూజియం సందర్శన -- భక్తుల సౌకర్యాలపై సమీక్ష**



**ఎస్.ఎస్. తాడ్వాయి మండలం ములుగు జిల్లా, :** శ్రీ సమ్మక్క--సారలమ్మ మహాజాతర సమీపిస్తున్న నేపథ్యంలో మేడారంలో చేపడుతున్న అభివృద్ధి పనులు, మౌలిక సదుపాయాల ఏర్పాట్లను రాష్ట్ర పంచాయతీ రాజ్, గ్రామీణ అభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి ధనసరి అనసూయ సీతక్క క్షేత్రస్థాయిలో పర్యవేక్షించారు. ఆదివారం మంత్రి సీతక్క, జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్., ఎస్పీ సుధీర్ రామ్ నాథ్ కేకన్లతో కలిసి మేడారం పరిసర ప్రాంతాల్లో విస్తృతంగా పర్యటించారు. ఇందులో భాగంగా చిలకలగుట్ట ప్రాంతాన్ని సందర్శించి భక్తుల రాకపోకలు, భద్రతా ఏర్పాట్లు, మౌలిక వసతుల పరిస్థితిని పరిశీలించారు. అనంతరం ట్రైబల్ మ్యూజియంను సందర్శించి అక్కడ జరుగుతున్న పనుల పురోగతిని సమీక్షించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, జాతర సందర్భంగా భక్తులకు ఎలాంటి లోటుపాట్లు లేకుండా అన్ని ఏర్పాట్లు సకాలంలో పూర్తయ్యేలా ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని తెలిపారు. మద్యం సేవించి జంపన్న వాగులోకి వెళ్లవద్దని భక్తులను సూచించారు. మేడారం చేరుకున్న వెంటనే జంపన్న వాగులో పుణ్యస్నానాలు ఆచరించి, అనంతరం అమ్మవార్ల దర్శనం చేసుకుని వంటావార్పు నిర్వహించుకోవాలని తెలిపారు. రద్దీ ఎక్కువగా ఉండే సమయాల్లో అప్రమత్తంగా ఉండాలని సూచించారు. చిన్నపిల్లలు, వృద్ధులను ఒంటరిగా వదిలివేయరాదని స్పష్టం చేస్తూ, కుటుంబ సభ్యులు అందరూ కలిసే ఉండాలని చెప్పారు. ఎవరికైనా దారి తప్పితే వెంటనే సమీపంలోని పోలీసు సిబ్బందిని లేదా అధికారులను సంప్రదించాలని సూచించారు. జాతరకు వచ్చే లక్షలాది మంది భక్తులకు తాగునీరు, పారిశుధ్యం, రహదారులు, దర్శన సౌకర్యాలు వంటి అంశాల్లో ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని అధికారులను ఆదేశించారు. భక్తుల భద్రతకు ప్రథమ ప్రాధాన్యం ఇవ్వాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ రేగ కళ్యాణి, సంబంధిత అధికారులు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

# సీఎం బాగోతం బయటకు రాకూడదనే

**బొగ్గు కుంభకోణం నుంచి రేవంత్‌ను బయటపడేసేందుకు భట్టి విఫలయత్నం**

**6 వేల కోట్ల సింగరేణి నిధుల స్కాంను త్వరలో బయటపెడతా: హరీశ్‌రావు**




**హైదరాబాద్, జనవరి 25 :** సింగరేణి కుంభకోణంపై దేశవ్యాప్తంగా చర్చ జరుగుతుంటే.. సీఎం రేవంత్‌రెడ్డి, ఆయన బావమరిది బాగోతం బయటకు రాకుండా ఉప ముఖ్యమంత్రి భట్టివిక్రమార్క కాపాడే ప్రయత్నం చేస్తున్నారని అసెంబ్లీలో బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ తన్నీరు హరీశ్‌రావు ఆరోపించారు. తనకు లేఖ రాస్తే రేవంత్ రెడ్డితో మాట్లాడతానని భట్టివిక్రమార్క అనడం విచిత్రంగా ఉందని, సాక్షాత్తూ ముఖ్యమంత్రే ఈ అవినీతికి సూత్రధారి అని తాము చెబుతుంటే ఆయనతో మాట్లాడితే ఏం ప్రయోజనమని హరీశ్ ప్రశ్నించారు. భట్టి మొన్నటి ప్రెస్‌మీట్‌లో బొగ్గు కుంభకోణంపై స్పష్టమైన సమాధానం ఇవ్వకుండా తన మాటల గారడీతో, నాలుగు కాగితాలు చూపి మసి పూసి మారేడు కాయ చేశారని విమర్శించారు. తన 40 ఏళ్ల అనుభవాన్ని ఉపయోగించి ముఖ్యమంత్రిని బొగ్గు స్కాం నుంచి బయటపడేసేందుకు విఫల ప్రయత్నాలు చేస్తున్నారని ఆరోపించారు. ఆదివారం తెలంగాణ భవన్‌లో హరీశ్ మీడియాతో మాట్లాడారు. భట్టి ఓబీ రిమూవల్ కాంట్రాక్టు పద్ధతికి వర్తించని నిబంధనలు చూపించి ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేశారని ఆరోపించారు. గతంలో ఎప్పుడూ కూడా ఓబీ పనులకు సైట్ విజిట్ సర్టిఫికెట్ విధానం లేనేలేదన్నారు. 'సైనిక్ స్కూల్ వాళ్ళు ఒక టెండర్ పిలిచారు. ఇందులో క్లాత్ డ్రైయర్ సరఫరా, ఏర్పాటు కోసం సైట్ విజిట్ పెట్టారు. దాన్ని తీసుకొచ్చి సింగరేణి ఓబీ కాంట్రాక్టుకు లింకు పెట్టి చూపడం హాస్యాస్పదమ'ని పేర్కొన్నారు. సైనిక్ స్కూళ్లలో బట్టలు ఆరబెట్టే మిషన్ల ఏర్పాటుకు సంబంధించిన నిబంధనను సింగరేణి సంస్థలో ఓబీ టెండర్లకు ముడిపెట్టి భారీ దోపిడీకి పాల్పడుతున్నారని ఆరోపించారు. టెండర్లలో పోటీని తగ్గించి, తమ అనుయాయులకు పనులు కట్టబెట్టేందుకు 'సైట్ విజిట్ సర్టిఫికెట్' అనే వింత నిబంధన తెచ్చారన్నారు. 2018 నుంచి 2024 వరకు ఓబీ టెండర్లలో ఈ షరతు లేదని, మరి ఇప్పుడు 2025-26లో మాత్రమే అదీ కొన్ని ఎంపిక చేసిన టెండర్లకే అకస్మాత్తుగా ఎందుకు తీసుకొచ్చారని ప్రశ్నించారు. 'మే 2025 నుంచి ఎంతమంది కాంట్రాక్టర్లు సైట్లు సందర్శించారు, ఎన్ని ఈమెయిల్స్, లేఖలు వచ్చాయి, ఎన్ని సర్టిఫికెట్లు జారీ అయ్యాయి, మిగిలిన వాటిని కారణం చెప్పకుండా ఎందుకు తిరస్కరించారో శ్వేతపత్రం విడుదల చేయాల'ని డిమాండ్ చేశారు. ఎన్‌సీసీ, జీఆర్ఎన్, మహాలక్ష్మి ఇలా ఎన్నో కంపెనీలు తమకు సైట్ విజిట్ సర్టిఫికెట్ ఇవ్వడం లేదని మెయిల్స్ చేశాయని, వాటిని బయటపెట్టాలని, లేదంటే తానే బయటపెడతానని హరీశ్‌రావు హెచ్చరించారు. బొగ్గు స్కాంపై నాలుగు మీడియాను సైతం తప్పుదారి పట్టించే ప్రయత్నం చేసిన భట్టి.. తాను ప్రస్తావించిన సోలార్ స్కామ్, పేలుడు పదార్థాల స్కామ్, ఉద్యోగుల డీ-ప్రమోషన్ వంటి కీలకాంశాలపై ఎందుకు మాట్లాడలేదని హరీశ్‌ప్రశ్నించారు. 2025 మే తర్వాత ఓబీ రిమూవల్ కాంట్రాక్టర్లకు ఏ టెండర్ వచ్చినా, సైట్ విజిట్ సర్టిఫికెట్ ఇవ్వడంలో సృజన్‌రెడ్డి రింగ్ మాస్టర్ అని తాను బయటపెట్టినా కూడా స్కాం జరగలేదని భట్టి బుకాయిస్తున్నారని విమర్శించారు. సిట్టింగ్ జడ్జి లేదా సీబీఐ విచారణ జరిపించాలని హరీశ్ డిమాండ్ చేశారు. నిజాయితీ ఉంటే సైట్ విజిట్ సర్టిఫికెట్‌పై జరిగిన అన్ని టెండర్లను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. 'ఈ కుంభకోణం సూత్రధారి ఏ హోటల్లో మీటింగ్ పెట్టారో సీఎం బంధువు కూడా అదే హోటల్లో కూర్చున్న ఫొటోలు సైతం తమ దగ్గర ఉన్నాయని, సమయం వచ్చినపుడు బయటపెడతానని చెప్పారు. సింగరేణిలో చాలా స్కాములు ఉన్నాయని, వాటినీ బయటపెడతానన్నారు. 'ఈ రెండేళ్లలో సింగరేణి అభివృద్ధి కోసం పక్కనపెట్టిన 6 వేల కోట్లు ఏమయ్యాయి?.. ఆ స్కాంను కూడా త్వరలో బయటపెడతాన'న్నారు. సింగరేణి గడించిన మొత్తం లాభం 6,394 కోట్లు అయితే, కేవలం 2,360 కోట్లేనని చూపించి కార్మికుల బోనసలో కోత పెట్టారని, మిగిలిన డబ్బును సీఎం తన ప్రచారానికి వాడుకుంటున్నారని విమర్శించారు.

# భూ రికార్డులపై భరోసా కల్పించేలా సర్వేయర్లు పని చేయాలి

**ధరణి అవకతవకలపై రాష్ట్రవ్యాప్తంగా ఫోరెన్సిక్ ఆడిట్**

**విడతల వారీగా భూ సర్వే పూర్తి చేసేందుకు కార్యాచరణ సిద్ధం**

**నాంపల్లి అగ్ని ప్రమాద బాధితులకు ఒక్కొక్కరికి రూ.5 లక్షల పరిహారం**

**లైసెన్స్డ్ సర్వేయర్లకు ధృవీకరణ పత్రాల పంపిణీ**






**ఖమ్మం :** భూ రికార్డులపై రైతులకు, భూ యజమానులకు భరోసా కల్పించేలా సర్వేయర్లు నిష్పక్షపాతంగా పని చేయాలని రాష్ట్ర రెవెన్యూ, హౌజింగ్, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి అన్నారు. ధరణి వ్యవస్థలో జరిగిన అవకతవకలపై రాష్ట్రవ్యాప్తంగా ఫోరెన్సిక్ ఆడిట్ చేపట్టామని, భూ సర్వేను విడతల వారీగా పూర్తి చేసేందుకు సమగ్ర కార్యాచరణ సిద్ధం చేశామని తెలిపారు. ఆదివారం ఖమ్మం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి, వైరా ఎమ్మెల్యే రాందాస్ నాయక్‌లతో కలిసి శిక్షణ పూర్తి చేసుకున్న లైసెన్స్ సర్వేయర్లకు ధృవీకరణ పత్రాలను మంత్రి అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, ధరణి వ్యవస్థను రద్దు చేసి భూ భారతి చట్టాన్ని అమలులోకి తీసుకువచ్చామని తెలిపారు. భూ భారతి చట్టానికి సంబంధించిన నియమ నిబంధనలు 90 రోజుల్లో రూపొందించామని చెప్పారు. ప్రతి భూమికి ప్రత్యేక గుర్తింపుగా భూ దార్ నంబర్ విధానంను ప్రవేశపెట్టనున్నట్లు వెల్లడించారు. ఇందుకోసం అవసరమైన సర్వేయర్ల వ్యవస్థను రూపొందించేందుకు వివిధ రాష్ట్రాల్లో అధ్యయనం చేసి ఉత్తమ విధానాన్ని అమలు చేశామని అన్నారు. సర్వేయర్లుగా పనిచేయడానికి ఆసక్తి చూపిన 10,120 మంది అభ్యర్థుల నుంచి దరఖాస్తులు స్వీకరించామని, మొదటి విడతలో 6,500 మందికి శిక్షణ ఇచ్చి పరీక్షలు నిర్వహించామని తెలిపారు. అందులో ఉత్తీర్ణత సాధించిన 3,511 మందికి గతంలో లైసెన్సులు జారీ చేశామని చెప్పారు. రెండో విడతలో మరో 2 వేల మంది ఉత్తీర్ణత సాధించగా, ఖమ్మం జిల్లాలో అర్హత పొందిన 47 మందికి లైసెన్సులు, ధృవీకరణ పత్రాలు అందజేశామని తెలిపారు. లైసెన్స్ సర్వేయర్లను మండలాల వారీగా భూముల పరిమాణం ఆధారంగా కేటాయిస్తామని చెప్పారు. భూ భారతి చట్టం అమలులో భాగంగా సర్వే పనులకు ఆధునిక సాంకేతికత వినియోగిస్తున్నామని, నక్షాలు లేని గ్రామాల్లో పైలట్ సర్వేలు నిర్వహించామని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా నక్షాలు లేని 413 గ్రామాల్లో మొదటి విడతగా సర్వే పనులు చేపట్టనున్నట్లు వెల్లడించారు.

ప్రతి జిల్లాలో 70 రెవెన్యూ గ్రామాలను గుర్తించి లైసెన్స్ సర్వేయర్ల ద్వారా సర్వే చేయడానికి కార్యాచరణ సిద్ధం చేసినట్లు చెప్పారు.

ధరణి వ్యవస్థలో జరిగిన అక్రమాలపై సిద్ధిపేట, సిరిసిల్ల జిల్లాల్లో పైలట్‌గా ఫోరెన్సిక్ ఆడిట్ చేపట్టామని, దీన్ని రాష్ట్రవ్యాప్తంగా విస్తరిస్తున్నామని మంత్రి తెలిపారు. రిజిస్ట్రేషన్ ప్రక్రియలో జరిగిన అవకతవకలపై ఎఫ్ఐఆర్‌లు నమోదు చేసి, రెవెన్యూ రికవరీ యాక్ట్ ప్రకారం డబ్బులు వసూలు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. భవిష్యత్తులో ఇలాంటి తప్పులు జరగకుండా పటిష్ట చర్యలు అమలు చేస్తున్నట్లు తెలిపారు. నాంపల్లి ఫర్నిచర్ షాప్ అగ్ని ప్రమాదంలో మృతిచెందిన వారి కుటుంబాలకు ప్రభుత్వం తరఫున ప్రతి బాధిత కుటుంబానికి రూ.5 లక్షల పరిహారం అందిస్తామని మంత్రి ప్రకటించారు. భవిష్యత్తులో అగ్నిప్రమాదాల నియంత్రణకు ప్రత్యేక కార్యాచరణ రూపొందిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో వైరా ఎమ్మెల్యే రాందాస్ నాయక్, అదనపు కలెక్టర్ పి. శ్రీనివాస్ రెడ్డి, రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వర రావు, సబ్ కలెక్టర్ అజయ్ యాదవ్, డీఆర్ఓ ఏ. పద్మశ్రీ, సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ అధికారులు, తహసీల్దార్లు, లైసెన్స్ సర్వేయర్లు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

# పెద్దచేపకు లాభం కోసమే గుంటనక్క కుట్రలు

**పెద్దచేపకు లాభం కోసమే గుంటనక్క కుట్రలు**

**గుంపు మేస్త్రికి అనుకూలంగా గుంటనక్క!**

**బీఆర్ఎస్ హయాంలో ఎక్సెస్‌కు టెండర్లు వేయలేదా?**

**గుంటనక్క వాటాలు తేలకనే అలా మాట్లాడుతున్నారు**

**మహేశ్‌గౌడ్ జాగృతిలోకి వస్తే జాతీయ కన్వీనర్‌ను చేస్తా!**

**మీడియాతో కల్వకుంట్ల కవిత**

**ఆ నక్కను అనుసరిస్తూ గుంతలో పడ్డ కేటీఆర్**



**హైదరాబాద్, జనవరి 25 :** బీఆర్ఎస్‌లోనే ఉంటూ కేసీఆర్‌కు ద్రోహం చేయాలని గుంటనక్క చూస్తోందని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవిత ఆరోపించారు. అందులో భాగంగానే పార్టీలో కొనసాగుతూ గుంపు మేస్త్రికి అనుకూలంగా ఉంటోందన్నారు. ఆ గుంటనక్కను అనుసరిస్తూ కేటీఆర్ గుడ్డిగా గుంతలో పడ్డారని చెప్పారు. తెలంగాణ ఏర్పడిన నాటి నుంచి ఇప్పటి వరకు సింగరేణిలో జరిగిన టెండర్లు, కాంట్రాక్టులపై విచారణ జరపాలని బీఆర్ఎస్ నేతలు ఏ ఉద్దేశంతో డిమాండ్ చేస్తున్నారో తనకు అర్థం కావడం లేదన్నారు. ఆదివారం తెలంగాణ జాగృతి కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆమె మాట్లాడుతూ.. సింగరేణిలో కాంగ్రెస్ వాటాలు తేలలేదని గుంటనక్క అంటున్నారని.. అసలు గుంటనక్క వాటాలు తేలకపోవడంతోనే అలా మాట్లాడుతున్నారని చెప్పారు. పైగా, ఆయన 2014 నుంచీ విచారణ చేయాలని డిమాండ్ చేస్తున్నారంటే బీఆర్ఎస్ ప్రభుత్వంపైనే విచారణ అడుగుతున్నట్లు కాదా? అని ప్రశ్నించారు. పాపం కేటీఆర్ కూడా అదే ట్రాప్‌లో పడి, అదేవిధంగా విచారణ జరపాలని సర్కారును డిమాండ్ చేస్తున్నారని తెలిపారు. సింగరేణి విషయంలో బీఆర్ఎస్ తప్పులే చేయనట్లు మా ట్లాడడం విచిత్రమని, బీఆర్ఎస్ హయాంలో అసలు టెండర్లు ఎక్సెసకు పోలేదని అబద్ధాలు చెప్పడం సరికాదన్నారు. బీఆర్ఎస్ హయాంలో దాదాపు 25 టెండర్లు పూర్తయితే.. అందులో కొన్నింటిని 16, 7, 8 శాతానికి పైగా ఎక్కువకు ఇచ్చారని ఆరోపించారు. గుంటనక్క ప్రెస్‌మీట్‌ను చూసిన కేటీఆర్ కూడా అవే విషయాలు మాట్లాడుతున్నారని, ఇటీవల ఆయన మాటలు చూస్తుంటే దారుణమనిపిస్తోంద న్నారు. సృజన్‌రెడ్డికి బీఆర్ఎస్ హయాంలోనే సింగరేణి పరిధిలో రెండు కాంట్రాక్ట్‌లు ఇచ్చారని, అప్పు డు ఆయన రేవంత్‌రెడ్డి బావమరిది అని గుర్తుకు రాలేదా? అని నిలదీశారు. బడా కాంట్రాక్టులు చేసే ఓ తిమింగలాన్ని రక్షించేందుకే గుంటనక్క చిన్నచేప చుట్టూ టెండర్ల వ్యవహారాన్ని తిప్పుతోందని ఆరోపించారు. సృజన్‌రెడ్డి చిన్నచేప అని, ఆ బడా సంస్థకు రూ.25వేల కోట్ల కాంట్రాక్ట్ ఇప్పించే ప్రయత్నం జరుగుతోందని తెలిపారు. బీఆర్ఎస్ హయాంలోనే సింగరేణికి రూ.25 వేల కోట్ల అప్పు పెట్టారని, కాంగ్రెస్ వచ్చాక అది రూ.50 వేల కోట్లయిందని, దీంతో సంస్థ జీతాల కోసం కూడా అప్పు తెచ్చుకునే పరిస్థితి ఏర్పడిందన్నారు. కాంగ్రెస్ హయాంలో ఇచ్చిన టెండర్లలో హరీశ్‌రావు అండగా ఉండే ఓ సంస్థకూ కాంట్రాక్టు ఇచ్చారని ఆమె ఆరోపించారు.

## దళితులను అవమానించేలా హరీశ్ వ్యాఖ్యలు

సింగరేణి టెండర్ల విషయంలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కకు లేఖ రాయనని, కేంద్రమంత్రి కిషన్‌రెడ్డికి మాత్రమే రాస్తానని హరీశ్‌రావు వ్యాఖ్యానించడం మొత్తం దళిత వర్గాలను అవమానించడమేన ని కవిత అన్నారు. గుంటనక్క కేంద్ర మంత్రికి లేఖ రాస్తాననడం వెనక కుట్ర దాగుందని, ఆ గుంటనక్క అడగ్గానే కిషన్‌రెడ్డి ఏదో పేరుతో కమిటీ వేశారని చెప్పారు. సింగరేణిలోని ఏజీఎం ర్యాంక్ అధికారితో కమిటీ వేస్తే ఆయన ఎండీని ఎలా ప్రశ్నిస్తారని నిలదీశారు. జాగృతి పక్షాన భట్టి విక్రమార్కకు పలు ప్రతిపాదనలతో లేఖ రాస్తున్నట్లు తెలిపారు. అదేవిధంగా నైనీ బ్లాక్‌ను సందర్శించేందుకు ప్రత్యేక ప్రతినిధుల బృందం వెళ్లనున్నట్లు ఆమె చెప్పారు.

## కేటీఆర్‌పై ఒక నీతి.. మహిళపై ఒక నీతా..?

గతంలో కేటీఆర్ మీద కథనం వస్తే ఆయన అనుచరులు చానెల్‌పై దాడి చే శారని.. అదే ఓ దళిత మ హిళపై కథనాలు ప్రసారం చేస్తే జర్నలిస్టులకు అండగా నిలిచారని కవిత ఆరోపించారు. బీఆర్ఎస్ దృష్టిలో కేటీఆర్‌కు ఒక నీతి, మహిళకు ఒక నీతా? అని ప్రశ్నించారు. ఏమాత్రం అవగాహన లేని యూట్యూబ్ చానెళ్ల మాదిరిగా శాటిలైట్ చానెళ్లలోనూ కథనాలు వేస్తున్నారని, దళి త ఆడబిడ్డల మీద అలాంటి కథనాలు వేయడంపై తాను ఎంతో బాధపడ్డానని చెప్పారు. గతంలో నిబంధనలను అతిక్రమించిన యూట్యూబ్ చానెల్ వాళ్ల ను బీఆర్ఎస్ ప్రభుత్వం అరెస్ట్ చేసిందని, కాంగ్రెస్ ప్రభుత్వం ఒక అడుగు ముందుకు వేసి శాటిలైట్ చానెల్ తినిధులను కూడా అరెస్ట్ చేసిందని తెలిపారు. కాగా, రాష్ట్రంలో ఫోన్ ట్యాపింగ్ జోక్ అయిందని, మునిసిపల్ ఎన్నికల కోసమే ప్రభుత్వం ఈ డ్రామా చేస్తోందని ఆరోపించారు.


## ఓడిపోయే కాంగ్రెస్‌లోకి వెళ్తానా..?

వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ ఓడిపోతుందని, తెలంగాణలో గెలిచే పార్టీ జాగృతి అని, అలాంటప్పుడు ఓడిపోయే పార్టీలోకి వెళ్లాల్సిన అవసరం తనకు లేదని కవిత అన్నారు. తాను కాంగటగ్రెస్‌లోకి వస్తానని అడిగితే వద్దని చెప్పానంటూ టీపీసీసీ అధ్యక్షుడు చేసిన వ్యాఖ్యలు హాస్యాస్పదమన్నారు. 'మహేశ్ అన్నా.. మీరు నిద్రలో కలగన్నట్లున్నారు. వాస్తవంలోకి రండి. ఎవరికైనా చూపించుకొని, ఏదైనా బొట్టు పెట్టించుకోండి' అని కవిత ఎద్దేవా చేశారు. 'జాగృతిని పటిష్ఠమైన పార్టీగా మార్చేందుకు ఏర్పాట్లు చేసుకుంటున్నాం. నా పనిలో నేను నిమగ్నమై ఉంటే నన్ను బద్నాం చేయాలనే ఇలాంటి మాటలు మాట్లాడుతున్నారు' అని చెప్పారు. టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌గౌడ్‌నే జాగృతిలోకి రమ్మని ఆహ్వానిస్తున్నామని కవిత అన్నారు. ఒకవేళ వస్తే సీనియర్‌గా ఆయనకు జాగృతి జాతీయ కన్వీనర్ పదవిని ఇస్తామని చెప్పారు.

మానేరు జనత
తెలుగు దినపత్రిక ఇది జనం గొంతుక
www.epaperjanathadaily.in
సోమవారం 26 జనవరి 2026


# అందరి చూపూ మన వైపే

## స్వదేశీకి ప్రపంచం ఫిదా



- స్వదేశీ ఉత్పత్తుల్లో నాణ్యతకు పెద్ద పీట వేద్దాం
- నాణ్యమైన ఉత్పత్తుల కోసం భారత్ వైపు ప్రపంచం చూపు
- మన వస్తువులు గ్లోబల్ మార్కెట్లో దుమ్ము రేపుతున్నాయి
- ఏదైనా కొనేటప్పుడు భారత్లో తయారైందా అని అడగండి
- జెన్ జెడ్లో భజన్ క్లబ్బింగ్ ట్రెండ్
- ఇది యువత చేపట్టిన ఆధ్యాత్మిక ఉద్యమం
- మన్ కీ బాత్లో ప్రధాని మోడీ
- ఓటు వేయడం ప్రతి ఒక్కరి బాధ్యత
- ఓటరు దినోత్సవాన యువతకు ప్రధాని లేఖ

న్యూఢిల్లీ: స్వదేశీ ఉత్పత్తుల్లో నాణ్యతకు పెద్ద పీట వేయా లని ప్రధాని నరేంద్ర మోడీ పిలుపునిచ్చారు. ఆదివారం ప్రసార మైన మన్ కీ బాత్ 130వ ఎపిసోడ్లో ప్రసంగిస్తూ చూస్తున్నా రా మిత్రులారా... ఇండియాలో తయారైన వస్తువులు ఇప్పుడు ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు పొందుతు న్నాయి. మన దేశంలో తయారైన వస్తువులకు డిమాండ్ పెరుగుతోంది. ఇది కేవలం ఆర్థిక ప్రగతి మాత్రమే కాదు. ఇది మన స్వాభిమానం, మన స్వతంత్రత కూడా. మనం వోకల్ ఫర్ లోకల్ అని అన్నాం కదా. ఇప్పుడు అది వోకల్ ఫర్ లోకల్ నుంచి గ్లోబల్ ఫర్ లోకల్ గా మారుతోంది. మన భారతీయ ఉత్పత్తులను కొనాలని ప్రపంచం ఆశపడుతోంది. మన బ్రాండ్లు, మన స్టార్టప్లు, మన యువత తయారు చేస్తున్న వస్తువులు ఇప్పుడు గ్లోబల్ మార్కె ట్లో దుమ్ము రేపుతున్నాయి. కానీ ఇక్కడ ఒక మంత్రం గుర్తుంచుకోండి... నాణ్యత! నాణ్యత!! నాణ్యత!!. మన ఉత్పత్తులు లోపరహితంగా ఉండాలి. పర్యావరణంపై చెడు ప్రభావం లేకుండా ఉండాలి. ఈ రెండూ ఉంటేనే మన భారతీయ బ్రాండ్లు ప్రపంచంలో శాశ్వతంగా నిలుస్తాయి. మీరు కూడా ఇప్పటి నుంచి ఏదైనా కొనేటప్పుడు ఇది మన భారత్లో తయా రైందా? అని ఒక్కసారి అడగండి. ఇది చిన్న ప్రశ్నకాదు. ఇది వికసిత్ భారత్ నిర్మాణంలో మీ భాగస్వామ్యం అని అన్నారు.

### జెన్ జెడ్లో భజన్ క్లబ్బింగ్ టెండ్

మన దేశంలో భజనలు, కీర్తనలు ఎప్పుడూ ఆత్మకు ఆహారంగా ఉండేవి. ఇప్పుడు యువతలో ఒక కొత్త ట్రెండ్ నడుస్తోంది. దీన్ని 'భజన్ క్లబ్బింగ్' అంటున్నారు. ఇది జెన్ జెడ్ యువతలో చాలా పాపులర్ అవుతోంది. లైట్లు, సౌండ్, ఎనర్జీల తో కాన్సర్ట్ లాంటి వాతావరణంలో భజనలు, భక్తి పాటలు మాత్రమే వినిపిస్తుం టాయి. భక్తి పట్ల గౌరవాన్ని, పవిత్రతను అలాగే ఉంచుతూ ఆధునిక రూపంలో భక్తిని అనుభవిస్తున్నారు. ఇది చూడటానికి చాలా ఆనందంగా, హృదయానికి ఆహ్లాదక రంగా ఉంది. భక్తి మార్గంలో యువత ఇలా కొత్త దారులు తీసుకుంటున్నారని తెలియడం సంతోషం కలిగిస్తోంది. ఇది భక్తి సంప్రదాయాన్ని ఆధునిక యువతకు అనుసంధానం చేసే గొప్ప ఉదాహరణగా పేర్కొన్నారు. ఆధ్యాత్మికతను తమ స్టైల్లో యువత ఆస్వాది స్తున్నారని, దీన్ని ఒక ఆధ్యాత్మిక ఉద్యమంగా గుర్తించాలని ప్రధాని అన్నారు.

### 3వ అతిపెద్ద స్టార్టప్ ఎకోసిస్టమ్గా భారత్

2016లో ప్రారంభమైన స్టార్టప్ ఇండియాను ప్రధాని గురించి గుర్తుచేశారు. ఇప్పుడు ప్రపంచంలో 3వ అతిపెద్ద స్టార్టప్ ఎకోసిస్టమ్లో భారత్ ఉంది. ఏఐ. స్పేస్, సెమీకండకర్స్ వంటి సకాండక్టర్స్ రంగాల్లో భారత స్టార్టప్లు ముందంజలో ఉన్నాయి. వీటన్నిం టిలో కీలకమైన పాత్ర పోషిస్తున్న యువతకు సెల్యూట్ అని తెలిపారు.

### పర్యావరణ పరిరక్షణలో సమాజం

పర్యావరణ పరిరక్షణ సమాజ భాగస్వామ్యాన్ని ప్రధానం గా ప్రస్తావిస్తూ ఉత్తరప్రదేశ్, అజమ్ గఢ్ లో తమసో నదిని ప్రజలు శుభ్రం చేసిన వైనాన్ని, ఆంధ్రప్రదేశ్, అనంతపురంలో రిజర్వా యర్లు శుభ్రం చేసి నీటి సంరక్షణ, చెట్లు నాటిన అనంత నీటి సంరక్షణ ప్రాజెక్ను మోడీ పేర్కొన్నారు. ప్రధానమంత్రి నరేంద్రమోడీ ఆదివారం ప్రత్యేక లేఖ రాశారు. జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా దేశ యువతకు ఆ లేఖలో ఈరోజు జాతీయ ఓటర్ల దినోత్సవం. ఇది కేవలం ఒక రోజు మాత్రమేకాదు ఇది మన ప్రజాస్వామ్య శక్తిని గుర్తుచేసే, బలపరిచే పవిత్ర దినం. మీరు 18 ఏళ్లు పూర్తి చేసుకున్న తర్వాత ఓటరుగా మారిన క్షణం ఒక పెద్ద వేడుకలా జరుపుకోవాలి. కుటుంబ సభ్యులు, స్నేహితులు, పాఠశాలలు, కళాశాలలు అందరూ కలిసి ఈ క్షణాన్ని స్వీట్లు పంచుకుంటూ, ఆనం దంగా జరుపుకోవాలి. ఓటు వేయడం అంటే ప్రజాస్వా మ్యంలో అత్యున్నత హక్కు మాత్రమే కాదు, అది అతి పెద్ద బాధ్యత కూడా. దేశ భవిష్యత్తును మీ ఓటు తీర్చిదిద్దుతుంది. మీరు ఓటరుగా మారడం అంటే భారతదేశ ప్రజాస్వామ్యానికి మీరు ప్రాణం పోసినట్లే. ప్రజాస్వామ్యానికి యువతే ఆధారం, శక్తి, భవిష్యత్తు. నారీ శక్తితో మన దేశం బలపడుతోంది. మహిళలు ఓటు వేసి, ప్రజాస్వామ్యాన్ని మరింత బలోపేతం చేస్తున్నారు. వికసిత్ భారత్ నిర్మాణంలో మీరంతా భాగస్వాములు. 18 ఏళ్లు పూర్తయిన ప్రతి యువకుడు, యువతి ఓటరుగా నమోదు అయ్యేలా చూడండి. మీ చుట్టూ ఉన్నవారిని ప్రోత్సహించండి, వారిని ఓటు హక్కు గురించి అవగాహన కల్పించండి. ఈ దినోత్సవం సందర్భంగా మన ఎన్నికల సంఘానికి అభినందనలు. వారికృషి వల్లే మనప్రజా స్వామ్యం ఇంత బలంగా నిలుస్తోంది. మీరంతా ప్రజాస్వామ్య ప్రక్రియల్లో మురుకుగా పాల్గొనండి. మీఓటు ద్వారా భారతదేశ ప్రజాస్వామ్యాన్ని మరింత గొప్పగా చేయండి అని మోడీ పిలుపునిచ్చారు

# కల్లోల ప్రపంచంలో భారత్ శాంతిదూత

## గణతంత్ర ప్రసంగంలో రాష్ట్రపతి ముర్ము

**న్యూఢిల్లీ :** ఘర్షణలు నెలకొన్న ప్రస్తుత ప్రపంచానికి భారత్ శాంతిదూతగా మారిందని రాష్ట్రపతి ముర్ము అన్నారు. మానవజాతి భవిష్యత్తు భద్రంగా ఉండేలా చూసేందుకు శాంతి సందేశాన్ని వినిపిస్తోందని చెప్పారు. 77వ గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని ఆదివారం ఆమె జాతినుద్దేశించి ప్రసంగించారు. ప్రపంచ పరిస్థితులను వివరిస్తూ విశ్వశాంతి కోసం ప్రార్థనలు చేయడం భారతీయ నాగరికతలో భాగమని, దాన్ని కొనసాగిస్తున్నట్టు చెప్పారు. అదే సమయంలో జాతి భద్రతకు కట్టుబడి ఉన్నట్టు తెలిపారు. ఉగ్రవాద స్థావరాలను ధ్వంసం చేయడానికి చేపట్టిన ఆపరేషన్ సిందూరే ఇందుకు నిదర్శనమని అన్నారు. రాష్ట్రపతి ముర్ము తన ప్రసంగంలో 'నారీ శక్తి'ని ప్రధానంగా ప్రస్తావించారు. 2047 నాటికి అభివృద్ధి చెందిన దేశంగా ఎదగడానికి మహిళల పాత్రే కీలకమని చెప్పారు. "గ్రామీణ స్వయం సహాయక బృందాలు, అంతరిక్షం, రక్షణ...ఇలా అన్నిరంగాల్లో ఆధునిక భారత చరిత్రను కుమార్తెలే రాస్తున్నారు" అని పొగిడారు. మహిళల ఆధారిత అభివృద్ధి జాతి ప్రాధాన్యతగా మారిందని నొక్కిచెప్పారు. మహిళా క్రికెట్ చరిత్రలో గత ఏడాది బంగారు అధ్యాయమని ప్రశంసించారు. వరల్డ్ కప్ గెలిచి గర్వకారణంగా నిలిచారని అన్నారు. డిజిటల్ ఆర్థిక రంగంలో విప్లవాత్మక మార్పులు వచ్చాయని, ప్రపంచానికే భారత్ నాయకత్వం వహిస్తోందని ముర్ము చెప్పారు.

# విరిసిన పద్మాలు!

- ప్రఖ్యాత క్యాన్సర్ వైద్య నిపుణుడు దత్తాత్రేయుడుకు పద్మ భూషణ్
- నటులు మురళీ మోహన్, రాజేంద్ర ప్రసాద్కు పద్మశ్రీ
- గరిమెళ్ల బాలకృష్ణప్రసాద్కు మరణానంతరం పురస్కారం
- తెలంగాణకు చెందిన ప్రముఖ వైద్యులు విజయ్ ఆనంద్ రెడ్డి, జీవీ రావు, డీఆర్డీవో మాజీ సైంటిస్ట్ చంద్రమౌళి, కూచిపూడి నృత్య కళాకారిణి దీపికారెడ్డిలకు పద్మశ్రీ
- పశుపోషణ నిపుణుడు ఎం.రామారెడ్డికి మరణానంతరం!
- 2026 పద్మ పురస్కారాలను ప్రకటించిన కేంద్ర ప్రభుత్వం
- 5 పద్మవిభూషణ్, 13 పద్మభూషణ్, 113 పద్మశ్రీ అవార్డులు
- ఏపీ నుంచి నలుగురు.. తెలంగాణ నుంచి ఏడుగురికి!
- పురస్కార గ్రహీతలకు అభినందనలు తెలిపిన ప్రధాని




**న్యూఢిల్లీ :** ప్రఖ్యాత క్యాన్సర్ వైద్య నిపుణుడు, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ ప్రభుత్వాల సలహాదారు డాక్టర్‌నోరి దత్తాత్రేయుడును ప్రతిష్ఠాత్మక పద్మ భూషణ్ పురస్కారం వరించింది! 77వ గణతంత్ర దినోత్సవం సందర్భంగా కేంద్ర ప్రభుత్వం ఈ ఏటి పద్మ పురస్కారాలను ఆదివారం ప్రకటించింది. విద్య, వైద్యం, సాహిత్యం, కళలు, సామాజిక సేవ.. ఇలా వివిధ రంగాల్లో విశేష సేవలు అందించిన 133 మంది ప్రముఖులకు 131 పురస్కారాలు (ఇందులో రెండు ద్వయో కేసులు.. అంటే, ఒకే రంగంలో కృషి చేసిన ఇద్దరికి కలిపి ఇచ్చిన అవార్డులున్నాయి) ప్రకటించింది. వీరిలో ఐదుగురికి పద్మవిభూషణ్.. 13 మందికి పద్మభూషణ్.. 113 మందికి పద్మశ్రీ అవార్డులు దక్కాయి. ఈ 131 మందిలో 19 మంది మహిళలు కాగా.. ఆరుగురు విదేశీ/ప్రవాస/భారతీయ మూలాలున్న/ఓవర్సీస్ సిటిజెన్ ఆఫ్ ఒడియా కేటగిరీకి చెందిన వ్యక్తులు.

అలాగే.. 16 మందికి మరణానంతరం ఈ పురస్కారాలను ప్రకటించారు. సాంకేతికంగా చూస్తే ఏపీ నుంచి నలుగురికి, తెలంగాణ నుంచి ఏడుగురికి పద్మశ్రీ అవార్డులు వచ్చాయి. కానీ, అవార్డులు వరించినవారిలో మొత్తం 14 మంది తెలుగువారు ఉన్నారు. తెలంగాణ నుంచి.. డీఆర్డీవోలో ప్రాజెక్ట్ డైరెక్టర్‌గా ఆకాశ్ క్షిపణి వ్యవస్థను రూపొందించడంలో కీలకపాత్ర పోషించిన మాజీ శాస్త్రవేత్త గడ్డమణుగు చంద్రమౌళి, ప్రముఖ మెటీరియల్ సైంటిస్ట్ కృష్ణమూర్తి బాలసుబ్రమణియన్, హ్యూమన్ జెనెటిక్స్ అండ్ పాపులేషన్ స్టడీసలో విస్తృతంగా కృషి చేసిన సీసీఎంబీ సైంటిస్ట్ కుమారస్వామి తంగరాజ్, కూచిపూడి నృత్య కళాకారిణి దీపికా రెడ్డి, ప్రముఖ సర్జికల్ గ్యాస్ట్రో ఎంటరాలజిస్టు గూడూరు వెంకట్‌రావు (జీవీ రావు), మూడు దశాబ్దాలుగా రేడియేషన్ ఆంకాలజిస్టుగా సేవలందిస్తున్న విజయ్ ఆనంద్ రెడ్డి, తెలంగాణ ప్రాంతంలో డెయిరీ రంగాన్ని ఆధునీకరించి అభివృద్ధి చేయడంలో కీలకపాత్ర పోషించిన మామిడి రామారెడ్డికి (మరణానంతరం) పద్మశ్రీ పురస్కారాలను ప్రకటించారు. తెలంగాణకే చెందిన ప్రముఖ విద్యావేత్త, యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ చైర్మన్ మామిడాల జగదీశ్‌కుమార్‌కు (ఈయన స్వగ్రామం నల్గొండ జిల్లా తిప్పర్తి మండలంలోని మామిడాల) ఢిల్లీ కోటాలో, హైదరాబాద్‌లో పుట్టి పెరిగి, ఐఐటీ బాంబేలో విద్యనభ్యసించి, ఇన్ఫోసిస్ సహా పలు కంపెనీల్లో పనిచేసిన ప్రముఖ సాంకేతిక నిపుణులు, ప్రసార భారతి సీఈవో, రాజ్యసభ టీవీ సీఈవోగా కూడా పనిచేసిన శశి శేఖర్ వెంపటికి కర్ణాటక కోటాలో పద్మశ్రీ పురస్కారాలు దక్కాయి. ఇక, ఏపీ నుంచి పద్మశ్రీ పురస్కారాలు అందుకున్నవారిలో.. అన్నమయ్య కీర్తనలెన్నింటికో స్వరకల్పన చేసిన ప్రముఖ సంగీత విద్వాంసుడు గరిమెళ్ల బాలకృష్ణ ప్రసాద్ (మరణానంతర పురస్కారం), ప్రముఖ నటులు మురళీ మోహన్, రాజేంద్ర ప్రసాద్, ప్రముఖ సంస్కృత పండితుడు, అంతర్జాతీయ సంస్కృత అధ్యయనాల సంస్థకు అధ్యక్షుడిగా ఉన్న వెంపటి కుటుంబ శాస్త్రి ఉన్నారు. నోరి దత్తాత్రేయుడు ఏపీలోని కృష్ణాజిల్లాకు చెందినవారే అయినప్పటికీ ఆయనకు అమెరికా కోటాలో పద్మభూషణ్ ప్రకటించారు.

### ఆ ఐదుగురిలో..

పద్మ అవార్డుల్లో అత్యున్నతమైన పద్మవిభూషణ్ వరించిన ఐదుగురిలో ముగ్గురు కేరళకు చెందినవారే కావడం విశేషం. ఆ ముగ్గురూ.. కమ్యూనిస్టు దిగ్గజ నేత, కేరళ మాజీ సీఎం వీఎస్ అచ్యుతానందన్ (మరణానంతరం), సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ కేటీ థామస్, సీపీఐ నేత పి.నారాయణన్. మిగతా ఇద్దరిలో ఒకరు.. ఇటీవలే మరణించిన బాలీవుడ్ వెటరన్ సూపర్‌స్టార్ ధర్మేంద్ర కాగా, మరొకరు ప్రముఖ వాయులీన విద్వాంసురాలు ఎన్.రాజం. పద్మభూషణ్ పురస్కారాన్ని అందుకున్న 13 మందిలో నోరి దత్తాత్రేయుడితోపాటు.. ప్రముఖ గాయని అల్కా యాజ్ఞిక్, మలయాళ సూపర్‌స్టార్ మమ్ముట్టి, ఝార్ఖండ్ ముక్తిమోర్చా పార్టీ వ్యవస్థాపకుడు శిబు సోరేన్, శతావధాని ఆర్ గణేశ్, కాళ్లపట్టి రామస్వామి పళనిస్వామి, వీకే మల్హోత్రా, విజయ్ అమృత్‌రాజ్, ఉదయ్ కోటక్ తదితరులున్నారు. అలాగే.. ఈ ఏడాది పద్మపురస్కారాలు అందుకున్నవారిలో నిశ్శబ్దంగా తమ తమ రంగాల్లో కృషి చేస్తున్న 54 మంది మట్టిలో మాణిక్యాలు ఉన్నారు. పద్మ పురస్కారాలు వరించినవారికి ప్రధాని మోదీ శుభాకాంక్షలు తెలిపారు. ఇక.. తెలుగు రాష్ట్రాల నుంచి ఈ అవార్డులకు ఎంపికైనవారికి సీఎం రేవంత్‌రెడ్డి అభినందనలు తెలిపారు. పద్మ పురస్కారాలకు ఎంపికైన వారిని ఆయన త్వరలో సన్మానించనున్నారు.

# శుభాన్షు శుక్లాకు అశోక చక్ర

- అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రానికి వెళ్లిన తొలి భారతీయుడు, వైమానిక దళ గ్రూప్ కెప్టెన్
- గగన్‌యాన్ మిషన్‌లో భాగమైన గ్రూప్ కెప్టెన్ బాలకృష్ణన్ నాయర్‌కు కీర్తిచక్ర అవార్డు
- మొత్తంగా 70 మందికి సైనిక పురస్కారాలు



**న్యూఢిల్లీ :** అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రానికి వెళ్లిన తొలి భారతీయుడు, వైమానిక దళ వింగ్ కమాండర్ శుభాంశు శుక్లాకు కేంద్రం అత్యున్నత సైనిక పురస్కారం 'అశోక చక్ర'ను ప్రకటించింది. ఇస్రో గగన్‌యాన్ మిషన్‌లో భాగమైన మరో గ్రూప్ కెప్టెన్ ప్రశాంత్ బాలకృష్ణన్ నాయర్‌ను కీర్తి చక్ర పురస్కారానికి ఎంపిక చేసింది. గణతంత్ర దినోత్సవం నేపథ్యంలో మొత్తంగా 70 మందికి సైనిక పురస్కారాలు ప్రకటించింది. మేజర్ అర్షదీపసింగ్, నాయబ్ సుబేదార్ డోలేశ్వర్ సుబ్బా, గ్రూప్ కెప్టెన్ ప్రశాంత్ బాలకృష్ణన్ నాయర్‌లను కీర్తిచక్ర పురస్కారానికి ఎంపిక చేసింది. మరో 13 మందికి శౌర్యచక్ర, ఒక బార్, టు సేన, 44 మందికి సేన, ఆరుగురికి నవ్ సేన, ఇద్దరికి వాయుసేన పురస్కారాలు ప్రకటించింది. ఈ పురస్కారాలకు ఎంపికైన వారిలో ఆరుగురికి మరణానంతరం ప్రకటించారు.

### అంతరిక్షానికి భారత ప్రతిష్ఠ

అంతరిక్షంలోకి మనుషులను పంపాలన్న లక్ష్యంలో భాగంగా ఇస్రో గగన్‌యాన్ ప్రాజెక్టును చేపట్టింది. అందులో భాగంగా శుభాంశు శుక్లా, ప్రశాంత్ బాలకృష్ణన్ నాయర్, మరో ఇద్దరికి వ్యోమగాములుగా శిక్షణ ఇస్తోంది. అంతరిక్షంలో పరిస్థితులు, ఇబ్బందులు, ప్రయాణానికి సంబంధించిన సమాచారాన్ని సిద్ధం చేసుకోవడం, అనుభవం కోసం వారిలో ఒకరిని ముందే విదేశాల ద్వారా అంతరిక్షంలోకి పంపాలని నిర్ణయించింది. సుఖోయ్, మిగ్, జాగ్వార్ సహా కీలక యుద్ధ విమానాలు నడిపిన అనుభవమున్న శుభాంశు శుక్లాను ఎంపిక చేసి.. యాక్సియం-4 మిషన్ ద్వారా ఐఎస్ఎస్ కు పంపింది. శుభాంశు శుక్లా అంతరిక్షంలో భార రహిత స్థితిలో పలు కీలక ప్రయోగాలు నిర్వహించారు. ఇస్రో గగన్‌యాన్ ప్రయోగాల కోసం ఆయన అనుభవం, సేకరించిన సమాచారం కీలకంగా మారనుంది. ఈ క్రమంలో ఆయనను అశోక చక్ర పురస్కారానికి ఎంపిక చేసింది. ఇక గగన్‌యాన్‌లో భాగంగా అంతరిక్షంలోకి పంపే బృందంలో కీలక సభ్యుడైన ప్రశాంత్ బాలకృష్ణన్‌కు కీర్తి చక్ర ప్రకటించింది. గగన్‌యాన్ కోసం మరో ఇద్దరు వాయుసేన గ్రూప్ కెప్టెన్లు అజిత్ కృష్ణన్, అంగద్ ప్రతాప్ శిక్షణ పొందుతున్నారు.

### ధైర్యంగా నిలిచిన పోరాటానికి గుర్తింపు

కీర్తిచక్ర పురస్కారం పొందిన మేజర్ అర్షదీప్ సింగ్ అస్సాం రైఫిల్స్ విభాగంలో పనిచేస్తున్నారు. గత ఏడాది మే 14న భారత్-మయన్మార్ సరిహద్దుల్లో గస్తీ నిర్వహిస్తున్న సమయంలో ఒక్కసారిగా విరుచుకుపడిన శత్రువులతో వీరోచితంగా పోరాడారు. తమ బృందంలో ఒక్కరికి కూడా ప్రాణ నష్టం జరగకుండా చూసుకుంటూనే.. పదుల సంఖ్యలో సాయుధులను మట్టుపెట్టారు. ఇక సైన్యంలోని పారాచూట్ రెజిమెంట్‌లో నాయబ్ సుబేదార్‌గా పనిచేస్తున్న డోలేశ్వర్ సుబ్బా జమ్మూకశ్మీర్‌లోని కిష్త్వార్ అడవుల్లో ధైర్యంగా ముందు నడిచి ఇద్దరు ఉగ్రవాదులను హతమార్చారు.

# నేడు గిగ్ వర్కర్ల దేశవ్యాప్త సమ్మె

**న్యూఢిల్లీ :** ఒక్క క్లిక్‌తో ఆహార పదార్థాలను చేతికి అందించే స్విగ్గీ, జొమాటో సేవలు సోమవారం నిలిచిపోనున్నాయి. అలాగే, నిత్యావసర వస్తువులను గుమ్మం ముందుకు తెచ్చే జెప్టో, బ్లింకింట్ వంటి యాప్‌లు నో సర్వీస్ మెసేజ్‌లతో దర్శనమివ్వనున్నాయి. అంతేకాదు, ర్యాపిడో, ఓలా, ఊబర్ వంటి యాప్‌లతో పాటు లాజిస్టిక్స్, ఈ-కామర్స్, డొమెస్టిక్ హెల్ప్ వంటి అనేక గిగ్ యాప్‌ల సేవలకు అంతరాయం కలగనుంది. తమ న్యాయమైన డిమాండ్లు నెరవేర్చాలని గిగ్ వర్కర్లు దేశవ్యాప్తంగా ఒక రోజు సమ్మెకు దిగుతున్నారు. ఇందులో భాగంగా సోమవారం వర్కర్లంతా గిగ్ యాప్‌ల నుంచి లాగౌట్ చేస్తారు. తద్వారా డెలివరీలు, వాహన రైడ్‌లు, గృహ అవసర సేవలకు వారు దూరంగా ఉంటారు. దీంతో గిగ్‌యాప్‌ల సేవలకు అంతరాయం ఏర్పడుతుంది. పనికి తగిన గౌరవం, సామాజిక గుర్తింపు, గిగ్ రంగంలో అవసరమైన రక్షణ హక్కులు కల్పించాలన్నదే వారి ప్రధాన డిమాండ్. తమ సామాజిక, ఆరోగ్య భద్రత, బీమా కోసం కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక చట్టం తేవాలని కోరుతున్నారు. తమ వివరణ కోరకుండా ఇష్టానుసారంగా అకౌంట్‌ను బ్లాక్ చేసే విధానంపై నిషేధం విధించాలని, ఫిర్యాదులను సరైన విధానంలో పరిష్కరించే మార్గదర్శకాలను రూపొందించాలని డిమాండ్ చేస్తున్నారు. మహిళా వర్కర్లు వేధింపులు, ఇబ్బందులకు గురైనప్పుడు వారికి వెంటనే ఉపయోగపడేలా యాప్‌లలో ఎమర్జెన్సీ బటన్‌ను అందుబాటులో ఉంచాలని కోరుతున్నారు. అంతేకాదు, ఫిబ్రవరి 3న దేశవ్యాప్త ఆందోళనలకు వారు సిద్ధమవుతున్నారు.

# హెచ్-1బీ వీసాదారులకు షాక్!

## వీసా స్టాంపింగ్ ఇంటర్వ్యూలు 2027కు వాయిదా




**న్యూఢిల్లీ :** వీసా స్టాంపింగ్ ఇంటర్వ్యూల కోసం ఎదురుచూస్తున్న వేలాది మంది హెచ్-1బీ వీసాదారులకు మరో షాక్ తగిలింది. ఇప్పటికే వీసా స్టాంపింగ్ ఇంటర్వ్యూల కోసం ఏడాదిగా ఎదురుచూస్తుండగా.. తాజాగా ఈ ఏడాదికి సంబంధించిన వారి ఇంటర్వ్యూ స్లాట్లు 2027కు వాయిదా పడ్డాయి. భారత్‌లోని అమెరికా రాయబార కేంద్రాల్లో బ్యాక్‌లాగ్స్ భారీగా పేరుకుపోవడంతో ఈ పరిస్థితి తలెత్తింది. ఢిల్లీ, ముంబై, చెన్నై, హైదరాబాద్, కోల్‌కతా కేంద్రాల్లో కొత్త ఇంటర్వ్యూ స్లాట్లు పూర్తిగా లభ్యం కాకపోవడంతో ఇప్పటికే ఉన్న అపాయింట్‌మెంట్లను అధికారులు 18 నెలలు వాయిదా వేసి 2027కు మార్చినట్లు తెలిసింది. దీనివల్ల భారత్‌కు చెందిన ఐటీ నిపుణులపై ప్రభావం పడనుంది. గతేడాది డిసెంబరులోనే ఈ జాప్యం మొదలైంది. దీంతో అప్పట్లో అపాయింట్‌మెంట్లను 2026 మార్చికి మార్చారు. ఆ తర్వాత జూన్‌కు, ఆపై అక్టోబరుకు వాయిదా వేశారు. మళ్లీ ఇప్పుడు 2027కు మార్చారు. ఈ పరిస్థితి ఇప్పట్లో మెరుగుపడే అవకాశం లేదని ఇమ్మిగ్రేషన్ నిపుణులు చెబుతున్నారు. ఇంటర్వ్యూ తేదీలు నిరంతరం వాయిదా పడుతున్నందున ప్రస్తుతం అమెరికాలో ఉన్న హెచ్-1బీ ఉద్యోగులు స్టాంపింగ్ కోసం భారత్‌కు వెళ్లొద్దని సూచిస్తున్నారు. 'అమెరికన్ బజార్' సంస్థ కూడా 2027 వరకూ సాధారణ అపాయింట్‌మెంట్లు కూడా అందుబాటులో లేవని వెల్లడించింది. స్టాంపింగ్ కోసం గత నెల భారత్‌కు వచ్చిన వారి ఇంటర్వ్యూలు కూడా రద్దైనట్టు పేర్కొంది.

మానేరు జనత
తెలుగు దినపత్రిక | ఇది జనం గొంతుక
www.epaperjanathadaily.in
సోమవారం 26 జనవరి 2026





పండుగ కాదు.. పరిపాలనా మహాకార్యక్రమం
జాతర కాదు.. జాతి ఆత్మగౌరవ ప్రతీక
ఆరాధన కాదు.. ఆదివాసీ సంస్కృతి ఉద్యమం
కోట్లాది భక్తుల విశ్వాసం...
వందల కోట్ల అభివృద్ధి పనులు...
వేలాది అధికారుల సమన్వయం...
తెలంగాణ ప్రతిష్ఠకు చిహ్నంగా నిలిచిన మహాజాతర మేడారం.

**ఇది మేడారం... ప్రపంచం చూసే మహాజాతర.**

# ప్రపంచం చూసే మహాజాతర
# మేడారం

**కోట్లాది భక్తులు.. 251 కోట్ల అభివృద్ధి.. 42 వేల మంది సిబ్బంది.. 21 శాఖల సమన్వయం.. తెలంగాణలో మహా పరిపాలనా పండుగగా మేడారం జాతర--2026**

అరణ్య గుండెల్లో పుట్టిన గిరిజన మహిళ పోరాటం -- తరతరాల విశ్వాసంగా మారి, నేడు ప్రపంచంలోనే అతిపెద్ద ఆదివాసీ ఆధ్యాత్మిక సమాగమంగా రూపాంతరం చెందింది. అదే శ్రీ సమ్మక్క--సారలమ్మ మేడారం మహాజాతర. ఇది కేవలం పండుగ మాత్రమే కాదొ గిరిజన ఆత్మగౌరవానికి నిలువెత్తు ప్రతీకగా, తెలంగాణ గౌరవానికి చిహ్నంగా మారింది.

కాకతీయుల కాలంలో కోయ గిరిజన సమాజానికి చెందిన సమ్మక్క, సామంతుల అన్యాయానికి ఎదిరించి పోరాడి అడవుల్లో అంతర్ధానమైందన్న విశ్వాసమే దేవతారూప ఆరాధనకు నాంది పలికింది. ఆమె కుమార్తె సారలమ్మ, మనవడు జంపన్న కూడా ప్రజల పక్షాన పోరాడి వీరమరణం పొందారనే గిరిజన కథనాలు మేడారాన్ని ఒక సాధారణ పూజా స్థలం నుంచి మహా విశ్వాస కేంద్రంగా మార్చాయి.

మేడారంలో విగ్రహాలు ఉండవు.. గద్దెలే దేవతల నివాసాలు. వేదమంత్రాలు ఉండవూ ఆదివాసీ సంప్రదాయాలే పూజలు. బెల్లం నైవేద్యం, కుంకుమ--పసుపు, వెదురు గద్దెలు, కోళ్ల బలి -- ఇవే మేడారం జాతర ప్రత్యేకతలు. అరణ్యమే ఆలయరొ ప్రకృతే దేవతా ఇదే మేడారం ఆత్మ.

- యాంసాని శివ కుమార్,
ఎడిటర్ /జనతా న్యూస్



## కోట్లకు చేరిన భక్తుల సంఖ్య

రెండేళ్లకోసారి జరిగే ఈ మహాజాతరలో లక్షలు కాదు -- కోట్ల మంది భక్తులు పాల్గొంటున్నారు. తెలంగాణతో పాటు ఛత్తీస్‌గఢ్, మధ్యప్రదేశ్, మహారాష్ట్ర, ఒడిశా రాష్ట్రాల నుంచి భక్తులు తరలివస్తూ మేడారాన్ని దేశవ్యాప్త ఆధ్యాత్మిక సమాగమంగా మార్చుతున్నారు. అడవుల్లో మొదలైన ఆరాధన నేడు గిరిజన సంస్కృతికి జాతీయ స్థాయి గుర్తింపుగా నిలిచింది. 1996లో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం మేడారం జాతరకు రాష్ట్ర పండుగ హోదా కల్పించింది. అప్పటి నుంచి మేడారం జాతర పరిపాలనా స్థాయిలోనూ అత్యంత ప్రాధాన్యం పొందిన కార్యక్రమంగా మారింది.

## చరిత్రలోనే అతిపెద్ద ఏర్పాట్లు

ఈ ఏడాది జరిగే మేడారం జాతరకు తెలంగాణ ప్రభుత్వం చరిత్రలో ఎప్పుడూ లేనంతగా ₹251 కోట్ల నిధులు కేటాయించింది. మాస్టర్ ప్లాన్ ద్వారా గద్దెల ప్రాంగణం ఆధునీకరణ, శాశ్వత రాతి కట్టడాలు, సుందరీకరణ పనులు చేపట్టారు. వందల సంవత్సరాలు నిలిచేలా పూర్తి రాతి నిర్మాణాలతో ఈసారి మేడారం జాతర భక్తులకు కనువిందు చేయనుంది. గత జాతరకు సుమారు 2 కోట్ల మంది భక్తులు రాగా, ఈసారి 3 కోట్ల మంది భక్తులు వస్తారని అధికారులు అంచనా వేస్తున్నారు. ఇందుకు అనుగుణంగా దాదాపు ఆరు నెలల ముందే ఏర్పాట్ల పనులు ప్రారంభించారు. రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి,

రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి, పంచాయతీ రాజ్ మంత్రి సీతక్క పర్యవేక్షణలో జిల్లా యంత్రాంగం యుద్ధప్రాతిపదికన ఏర్పాట్లు చేపట్టింది. జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్ సారథ్యంలో అన్ని శాఖలు సమన్వయంతో పనిచేస్తున్నాయి.

## మహా పరిపాలనా ప్రణాళిక

జాతర నిర్వహణను సాధారణ పండుగగా కాకుండా ఒక మహా పరిపాలనా కార్యాచరణగా రూపొందించారు. మొత్తం 21 శాఖలు సమన్వయంతో పనిచేస్తున్నాయి. జాతర ప్రాంతాన్ని 8 పరిపాలనా జోన్లు 42 సెక్టార్లుగా విభజించారు. మొత్తం 42,027 మంది సిబ్బంది విధుల్లోకి దిగారు. జాతర ప్రధాన నాలుగు రోజుల్లోనే 30,904 మంది అధికారులు, సిబ్బంది సేవలందించనున్నారు.

## రహదారులు.. పార్కింగ్... రవాణా

భారీ భక్తుల రాకపోకలను దృష్టిలో పెట్టుకుని రహదారులపై ప్రత్యేక దృష్టి సారించారు. 525 రహదారి సమస్యలను గుర్తించి పరిష్కరించారు. 49 రహదారుల్లో మరమ్మతులు, విస్తరణ పనులు చేపట్టారు. 10 కొత్త రహదారులు, 3 కొత్త కల్వర్టులు నిర్మించారు. పార్కింగ్ కోసం 42 ప్రదేశాల్లో 1,418 ఎకరాల విస్తీర్ణం కేటాయించారు. టీజీఎస్‌ఆర్టీసీ ద్వారా **4,000** బస్సులు **51,000** ట్రిప్పులు నడపాలని ప్రణాళిక. సుమారు 20 లక్షల మంది ప్రయాణికులు ఆర్టీసీ సేవలు వినియోగించుకునే అవకాశం ఉందని అంచనా.

## డిజిటల్ జాతర


మేడారం జాతర-2026ను ఈసారి డిజిటల్ మహాజాతరగా రూపొందించారు. ప్రత్యేక మొబైల్ యాప్, అధికారిక వెబ్‌సైట్, ఔష్ట్రఘ్‌రాూజూజూ చాట్‌బాట్ ద్వారా భక్తులకు అవసరమైన అన్ని సమాచారం ఒక్కచోటే అందుబాటులోకి తెచ్చారు. వైద్య శిబిరాలు, పార్కింగ్, రవాణా మార్గాలు, SOS అలర్ట్, మిస్సింగ్ పర్సన్స్ సేవలు, భద్రతా హెల్ప్‌డెస్క్ వంటి అన్ని సేవలు డిజిటల్ ప్లాట్‌ఫామ్ ద్వారా భక్తుల అరచేతిలోకి వచ్చాయి.

## ప్లాస్టిక్ రహిత మేడారం

మేడారం అరణ్య సంస్కృతికి ప్రతీక. "అడవి నాశనం అయితే దేవతలు కోపిస్తారు" అనే ఆదివాసీ విశ్వాసంతో ఈసారి ప్లాస్టిక్ రహిత మేడారం నినాదంతో జాతర నిర్వహించేందుకు ప్రభుత్వం పిలుపునిస్తోంది.









# భక్తులు మెచ్చిన ఇప్పపువ్వు లడ్డు

**మొట్టమొదటిసారిగా మేడారం జాతరలో అందుబాటులో ప్రత్యేక గిరిజన ఉత్పత్తి**

**మార్కెట్‌లో మంచి డిమాండ్ -- ఇప్పటివరకు రూ.3 లక్షల వ్యాపారం**





హైదరాబాద్, జనతా న్యూస్ : 25 జనవరి 2026 ఆసియాలోనే అతి పెద్ద గిరిజన జాతరగా పేరుగాంచిన మేడారం మహాజాతర--2026లో ఈసారి భక్తులకు ప్రత్యేక ఆకర్షణగా ఇప్పపువ్వు లడ్డు అందుబాటులోకి వచ్చింది. మేడారం జాతరలో మొట్టమొదటిసారిగా గిరిజన మహిళా సంఘాల ఆధ్వర్యంలో తయారైన ఈ లడ్డు భక్తుల నుంచి విశేష ఆదరణ పొందుతోంది. సమ్మక్క--సారలమ్మ మహిళా రైతు ఉత్పత్తుల సంఘం ఆధ్వర్యంలో తయారైన ఈ ఇప్పపువ్వు లడ్డు జనవరి 13న మేడారం వేదికగా స్టాల్స్ ప్రారంభమయ్యాయి. ప్రారంభం నుంచి ఇప్పటివరకు సుమారు రూ.3 లక్షల వ్యాపారం జరిగినట్లు నిర్వాహకులు తెలిపారు. మేడారం పరిసర ప్రాంతాల్లో మొత్తం 10 స్టాల్స్ ఏర్పాటు చేశారు. ఒక బాక్స్‌లో 250 గ్రాములు ఉండే లడ్డును రూ.150కు విక్రయిస్తున్నారు. ఇప్పపువ్వు లడ్డు అధిక పోషక విలువలు కలిగి ఉండటంతో భక్తుల నుంచి మంచి స్పందన లభిస్తోంది. జీర్ణక్రియ మెరుగుపడడం, రోగనిరోధక శక్తి




పెరగడం, శక్తి వృద్ధి, బరువు నియంత్రణ, డయాబెటిస్ నియంత్రణకు ఉపయోగపడుతుందని నిపుణులు చెబుతున్నారు. ముఖ్యంగా గర్భిణీ స్త్రీలకు ఇది ఎంతో మేలు చేస్తుందని, పుట్టబోయే బిడ్డ ఆరోగ్యానికి ఉపయోగకరమని కొనుగోలుదారులు తెలిపారు. ఈ లడ్డు తయారీ ద్వారా గిరిజన మహిళలకు ఆర్థిక భరోసా కల్పించడమే లక్ష్యంగా ప్రజా ప్రభుత్వం ఈ కార్యక్రమాన్ని ప్రోత్సహిస్తోంది. తెలంగాణ సమగ్ర జీవనోపాధి కార్యక్రమం, గ్రామీణ పేదరిక నిర్మూలన సంఘం ద్వారా 12 మంది గిరిజన మహిళలతో సమ్మక్క--సారలమ్మ మహిళా రైతు ఉత్పత్తుల సంఘం ఏర్పాటు చేసి, ఉట్నూర్ ఐటీడీఏ ప్రత్యేక బృందం ద్వారా శిక్షణ ఇచ్చారు. ములుగు జిల్లా తాడ్వాయి మండలం కొండపర్తి గ్రామంలో ఇప్పపువ్వు లడ్డు తయారీ యూనిట్ ఏర్పాటు చేశారు. జనవరి 18న మేడారం వేదికగా జరిగిన రాష్ట్ర క్యాబినెట్ సమావేశంలో ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి, మంత్రులు, అధికారులకు ఇప్పపువ్వు లడ్డులను పంపిణీ చేశారు. భక్తులు, కొనుగోలుదారులు మాట్లాడుతూ ఇప్పపువ్వు లడ్డు రుచి అమోఘంగా ఉందని, ఆరోగ్యపరంగా ఎంతో ఉపయోగకరమని, ముఖ్యంగా మహిళలు, గర్భిణీ స్త్రీలు దీనిని ఎక్కువగా వినియోగిస్తున్నారని తెలిపారు. మేడారం మహాజాతరలో ఈ ఏడాది ఇప్పపువ్వు లడ్డు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తోంది.

# సకల వసతులతో ఏదులాపురాన్ని ఆదర్శవంతంగా తీర్చిదిద్దుతాం

- పేదలకు అండగా ఇందిరమ్మ ప్రభుత్వ పాలన
- ఏప్రిల్ నుంచి మరో విడత ఇందిరమ్మ ఇండ్లు మంజూరు
- ఏదులాపురం మున్సిపాలిటీలో అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, మహిళలకు కుట్టుమిషన్ల పంపిణీ






ఖమ్మం / ఏదులాపురం, జనతా న్యూస్ : 25 జనవరి 2026 సకల వసతులతో ఏదులాపురం పట్టణాన్ని ఆదర్శవంతంగా అభివృద్ధి చేస్తామని రాష్ట్ర రెవెన్యూ, హౌజింగ్, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి తెలిపారు. ఆదివారం ఏదులాపురం మున్సిపాలిటీలో జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టితో కలిసి మంత్రి పర్యటించారు. 28వ వార్డు చైతన్య నగర్‌లో రూ.11.30 లక్షలతో, పెద్దతండా 27వ వార్డు ఆర్‌ఎస్ నగర్‌లో రూ.26 లక్షలతో, పెద్దతండా 5వ వార్డు కేబీఆర్ నగర్‌లో రూ.11.30 లక్షలతో, తెల్దారుపల్లి 14, 15 వార్డుల్లో రూ.50.30 లక్షలతో, 16వ వార్డులో రూ.33.70 లక్షలతో నిర్మించనున్న సీసీ రోడ్లు, డ్రైన్లు, అలాగే తెల్దారుపల్లి జంక్షన్ అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేశారు. అలాగే ఇందిరా మహిళా శక్తి కార్యక్రమంలో భాగంగా పెద్దతండా ఆర్‌ఎస్ నగర్‌లో 37 మంది ముస్లిం మైనారిటీ మహిళలకు కుట్టుమిషన్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, ఏదులాపురం మున్సిపాలిటీ పరిధిలో గత రెండు సంవత్సరాల్లో సుమారు రూ.57 కోట్లతో పలు అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టినట్లు తెలిపారు. అర్హులైన పేదలకు నూతన రేషన్ కార్డులు జారీ చేయడంతో పాటు పాత కార్డుల్లో కొత్త సభ్యులను చేర్చామని చెప్పారు. మౌళిక వసతుల కల్పన లక్ష్యంగా సీసీ రోడ్లు, డ్రైన్ల నిర్మాణ పనులు చేపట్టామని పేర్కొన్నారు. పేదల ఇండ్లపై ఉన్న విద్యుత్ లైన్ల తొలగింపుకు చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. గురుకులాల్లో డైట్ చార్జీలు, కాస్మోటిక్ చార్జీలు పెంచామని చెప్పారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, 200 యూనిట్ల ఉచిత విద్యుత్, సన్నబియ్యం సరఫరా, నూతన రేషన్ కార్డుల పంపిణీ వంటి పథకాలు అమలవుతున్నాయని తెలిపారు. ఇందిరమ్మ ఇండ్ల పథకంలో మొదటి విడతలో 4.5 లక్షల ఇళ్లకు అనుమతి ఇచ్చినట్లు, ఏదులాపురంలో సుమారు 570 ఇళ్లు మంజూరైనట్లు తెలిపారు. రాబోయే మూడు విడతల్లో అర్హులందరికీ ఇందిరమ్మ ఇండ్లు అందిస్తామని, ప్రతి సోమవారం నిర్మాణ పురోగతి ఆధారంగా నిధులు విడుదల చేస్తున్నామని చెప్పారు.

ఏప్రిల్ నెల నుంచి మరో విడత ఇందిరమ్మ ఇండ్ల మంజూరు ఉంటుందని వెల్లడించారు. ఏదులాపురాన్ని రోడ్లు, డ్రైన్లు, పార్కులు, మౌళిక వసతులతో కూడిన మోడల్ పట్టణంగా అభివృద్ధి చేయడమే లక్ష్యమని మంత్రి తెలిపారు. జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి మాట్లాడుతూ, ఏదులాపురం మున్సిపాలిటీ పరిధిలో రోడ్లు, డ్రైన్లు లేని కాలనీల్లో మౌళిక వసతుల కల్పన కోసం ప్రభుత్వం రూ.15 కోట్లు మంజూరు చేసిందని, టెండర్ ప్రక్రియ పూర్తయ్యిందని, పనులు త్వరలో ప్రారంభమవుతాయని తెలిపారు. ఏదులాపురాన్ని మోడల్ మున్సిపాలిటీగా తీర్చిదిద్దే దిశగా అధికారులు, ప్రజాప్రతినిధులు కలిసి పనిచేస్తున్నారని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఆర్‌అండ్‌బీ ఎస్‌ఈ యాకుబ్, పబ్లిక్ హెల్త్ ఎస్‌ఈ రంజిత్, ఖమ్మం ఆర్డీవో నర్సింహారావు, పాలేరు నియోజకవర్గ ప్రత్యేక అధికారి రమేష్, జిల్లా మైనారిటీ అభివృద్ధి అధికారి ముజాహిద్, ఖమ్మం రూరల్ తహసీల్దార్ రాంప్రసాద్, మున్సిపల్ కమిషనర్ మునవర్ అలీ, వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## జర్నలిస్టుల హక్కులు, సంక్షేమం కోసం డబ్ల్యూజేఐ మాత్రమే నికర పోరాటం

**డబ్ల్యూజేఐ ఖమ్మం సన్నాహక సమావేశంలో ఎన్.ఎస్. రావు**

**ఖమ్మం జిల్లా "అడ్ హాక్" కమిటీ ఏకగ్రీవ ఎన్నిక**




ఖమ్మం, జనతా న్యూస్ : 25 జనవరి 2026 భారతదేశంలోని జర్నలిస్టుల సంక్షేమం, హక్కులు, వృత్తిపరమైన గౌరవం కోసం నికరంగా పోరాడుతున్న సంస్థ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఆఫ్ ఇండియా మాత్రమేనని యూనియన్ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి ఎన్.ఎస్. రావు అన్నారు. ఖమ్మంలోని రామాలయం ఫంక్షన్ హాల్‌లో సీనియర్ జర్నలిస్టు ఎం.ఏ. అన్సార్ పాషా అధ్యక్షతన జరిగిన వర్కింగ్ జర్నలిస్ట్స్ ఆఫ్ ఇండియా ఖమ్మం జిల్లా సన్నాహక సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, జర్నలిస్టుల హక్కులు, భద్రత, సంక్షేమం కోసం వర్కింగ్ జర్నలిస్ట్స్ ఆఫ్ ఇండియా దేశవ్యాప్తంగా కార్యక్రమాలు చేపడుతోందన్నారు. న్యూస్ వెబ్‌సైట్లలో పని చేస్తున్న జర్నలిస్టులను వర్కింగ్ జర్నలిస్టులుగా గుర్తింపజేయడంలో ఈ సంఘం కీలక పాత్ర పోషించిందని తెలిపారు. జర్నలిస్టుల భద్రతపై ప్రత్యేక దృష్టి పెట్టాల్సిన అవసరం ఉందని, విధి నిర్వహణలో ఉన్న జర్నలిస్టులపై దాడులకు కఠిన శిక్షలు పడేలా "జర్నలిస్టుల రక్షణ చట్టం" తీసుకురావాలని డిమాండ్ చేశారు. జర్నలిస్టులకు పెన్షన్, ఆరోగ్య బీమా, ఇతర సంక్షేమ పథకాలు వర్తింప చేయాలని, మజీథియా వేతన బోర్డు సిఫార్సులు అమలు చేయాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం జర్నలిస్టుల ఇళ్ల స్థలాల సమస్యను త్వరగా పరిష్కరించాలని కూడా డిమాండ్ చేశారు. ప్రస్తుత మీడియా రంగంలో కార్పొరేట్ ప్రభావం, కాంట్రాక్ట్ విధానం జర్నలిస్టులకు సవాలుగా మారిందని పేర్కొంటూ, దీనిపై చట్టపరమైన పోరాటాలతో పాటు నైపుణ్యాభివృద్ధి శిక్షణ కార్యక్రమాలు అవసరమని అన్నారు.

**ఖమ్మం జిల్లా "అడ్ హాక్" కమిటీ ఎన్నిక**

సమావేశం అనంతరం వర్కింగ్ జర్నలిస్ట్స్ ఆఫ్ ఇండియా ఖమ్మం జిల్లా "అడ్ హాక్" కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా కన్వీనర్‌గా గంటెల ఆనంద్ ఎన్నికయ్యారు. కో-కన్వీనర్లుగా యెన్నబోయిన శ్రీనివాస రావు, ఎం.ఏ. అన్సార్ పాషా, ఎన్. రామకృష్ణ, అమరనేని రామకృష్ణ, నాగరాజు దేవర ఎన్నికయ్యారు.

సభ్యులుగా గోగుల నారాయణ రావు, కొమ్మినేని ప్రసాద రావు, కట్టెకోల చిన్న నరసయ్య, పోటు శ్రీనివాస రావు, జాబిశెట్టి కుటుంబ రావులను ఎంపిక చేశారు.

ఖమ్మం నియోజకవర్గ కన్వీనర్‌గా కె. కళ్యాణ్ చక్రవర్తి ఎన్నికయ్యారు. ఈ సమావేశంలో ఎనిగళ్ల శ్రీనివాస రావు, బొడ్డుపల్లి రవీందర్ తదితర సీనియర్ జర్నలిస్టులు పాల్గొన్నారు.

## కరీంనగర్ పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో వార్షిక డీ-మొబిలైజేషన్ పరేడ్

**ముఖ్య అతిథిగా సీపీ గౌష్ ఆలం, ఐపీఎస్**




కరీంనగర్, జనతా న్యూస్ : కరీంనగర్ పోలీస్ కమిషనరేట్ పరిధిలోని పరేడ్ గ్రౌండ్‌లో ఆదివారం నిర్వహించిన వార్షిక డీ-మొబిలైజేషన్ (Annual De-mobilization) పరేడ్ కార్యక్రమం ముగిసింది. ఈ కార్యక్రమానికి పోలీస్ కమిషనర్ గౌష్ ఆలం, ఐపీఎస్ ముఖ్య అతిథిగా హాజరై, సిబ్బంది గౌరవ వందనాన్ని స్వీకరించి పరేడ్‌ను పర్యవేక్షించారు. అనంతరం పోలీస్ సిబ్బందిని ఉద్దేశించి సీపీ ప్రసంగిస్తూ, ప్రతి సంవత్సరం నిర్వహించే ఈ శిక్షణా కార్యక్రమాల ద్వారా పోలీస్ సిబ్బందికి వృత్తిపరమైన నైపుణ్యాలు మరింత బలోపేతం అవుతాయని తెలిపారు. బేసిక్ ఇండక్షన్ ట్రైనింగ్ పూర్తయ్యాక కూడా ఇటువంటి వార్షిక శిక్షణ తరగతులు పోలీసుల్లో నైపుణ్యం, ఆత్మవిశ్వాసాన్ని పెంపొందిస్తాయని, ప్రజలకు సమర్థవంతమైన సేవలు అందించేందుకు ఇవి ఉపయోగపడతాయని అన్నారు. గత నాలుగు వారాలుగా జరిగిన శిక్షణా కాలంలో సిబ్బందికి క్షేత్రస్థాయి విధులకు సంబంధించిన పలు అంశాలపై శిక్షణ అందించామని తెలిపారు. వివిధ రకాల తుపాకుల వినియోగం, నిర్వహణ, ఖైదీలను కోర్టులకు లేదా ఇతర ప్రాంతాలకు తరలించే సమయంలో పాటించాల్సిన భద్రతా నియమాలు, భద్రతా గార్డు విధులు, పర్సనల్ సెక్యూరిటీ ఆఫీసర్ (PSO) బాధ్యతలు, అత్యవసర సమయాల్లో ఫైరింగ్ విధానంపై ప్రాక్టికల్ శిక్షణ ఇచ్చినట్లు వివరించారు. శిక్షణను విజయవంతంగా పూర్తి చేసిన అధికారులు, సిబ్బందిని సీపీ అభినందించారు. ఇలాంటి శిక్షణ కార్యక్రమాలు పోలీసు వ్యవస్థను మరింత పటిష్టంగా తీర్చిదిద్దడంలో సహకరిస్తాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ డీసీపీలు వెంకటరమణ, భీంరావు, ఆర్ఐ (పరిపాలన) రజినీకాంత్, కమిషనరేట్ పరిధిలోని ఇతర ఉన్నతాధికారులు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## ప్రైవేట్ పీఈటీల క్రికెట్ లీగ్ పోస్టర్ ఆవిష్కరణ

**పిపిఈటిఏ సూపర్ సిక్స్ క్రికెట్ లీగ్ ఫిబ్రవరి 1న**





కరీంనగర్, జనతా న్యూస్ : జిల్లా ప్రైవేటు వ్యాయామ విద్య ఉపాధ్యాయ సంఘం ఆధ్వర్యంలో ఫిబ్రవరి 1న నిర్వహించనున్న పిపిఈటిఏ సూపర్ సిక్స్ క్రికెట్ లీగ్ పోటీలకు సంబంధించిన వాల్ పోస్టర్‌ను ఆదివారం మాజీ మంత్రి, కరీంనగర్ ఎమ్మెల్యే గంగుల కమలాకర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, జిల్లాలోని ప్రైవేట్ వ్యాయామ ఉపాధ్యాయులకు అవసరమైన సహాయ సహకారాలు అందిస్తానని తెలిపారు. ప్రైవేట్ వ్యాయామ ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని చెప్పారు. ప్రస్తుత కాలంలో క్రీడలకు ఆదరణ పెరుగుతున్న నేపథ్యంలో, ప్రైవేట్ పాఠశాలల్లో విద్యార్థులను క్రీడల్లో రాణించేలా తీర్చిదిద్దాలని సూచించారు. ప్రతి పాఠశాలలో పీఈటీ పోస్టులు మంజూరు చేయాలని ప్రభుత్వాన్ని కోరనున్నట్లు తెలిపారు. ఫిబ్రవరి 1న కరీంనగర్ అంబేద్కర్ స్టేడియంలో ఈ క్రికెట్ పోటీలను నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు ఎమ్మెల్యేకు వివరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఒలింపిక్ సంఘం అధ్యక్షుడు, ప్రైవేట్ వ్యాయామ విద్య ఉపాధ్యాయ సంఘం గౌరవ అధ్యక్షుడు నందెల్లి మహిపాల్, జిల్లా సంఘం అధ్యక్షుడు బత్తిని శ్రీధర్ గౌడ్, కార్యదర్శి దారం గౌతమ్ రెడ్డి, కోశాధికారి కంకటి అనూప్ కుమార్, ముఖ్య సలహాదారు సిలివేరి మహేందర్‌తో పాటు మైపాల్, ముఫాజిల్, స్వామి, ప్రశాంత్, దుర్గరాజు, రవి, శివ, నరేందర్, జీవన్, రవికుమార్, మహ్మద్ రూఫ్, షరీఫ్, రాజు, అంజి, రాకేష్, మనీ, వినయ్, సుశీల్, మహేందర్, శ్రీనివాస్ నాయక్, రాజేష్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం జిల్లా ప్రైవేటు వ్యాయామ విద్య ఉపాధ్యాయ సంఘం ఆధ్వర్యంలో ఎమ్మెల్యే గంగుల కమలాకర్‌ను సత్కరించారు.

# కరీంనగర్ జిల్లా కలెక్టర్‌కు విశిష్ట గౌరవం

**ఎన్నికల నిర్వహణలో ఉత్తమ కృషికి రాష్ట్ర స్థాయి అవార్డు**




కరీంనగర్, జనతా న్యూస్ : జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని పురస్కరించుకుని రాష్ట్ర స్థాయి వేడుకల్లో కరీంనగర్ జిల్లాకు మరో విశిష్ట గౌరవం దక్కింది. ఎన్నికల నిర్వహణలో వినూత్న ఓటర్ల అవగాహన కార్యక్రమాలు, శిక్షణ, సామర్థ్యాభివృద్ధి రంగాల్లో చేసిన ఉత్తమ కృషికి గాను కరీంనగర్ జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి రాష్ట్ర స్థాయి అవార్డుకు ఎంపికయ్యారు. హైదరాబాద్‌లో నిర్వహించిన రాష్ట్ర స్థాయి కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ చేతుల మీదుగా ఈ అవార్డును కలెక్టర్ పమేలా సత్పతి స్వీకరించారు. కలెక్టర్ దిశానిర్దేశంలో ఎన్నికల ప్రక్రియలో కీలక పాత్ర వహించే ఎన్నికల అధికారులు, సహాయక అధికారులు, పోలింగ్ సిబ్బంది, పరిశీలకులకు శిక్షణ కార్యక్రమాలు నిర్వహించారు. ఎన్నికల నిబంధనలు, విధివిధానాలపై స్పష్టమైన అవగాహన కల్పించడం, సిబ్బంది నైపుణ్యాలను మెరుగుపరచడం, పారదర్శకతతో ఎన్నికలు నిర్వహించేలా తీసుకున్న చర్యలు ఈ అవార్డుకు ప్రధాన కారణాలుగా నిలిచాయి. అలాగే, వినూత్న ఓటర్ల అవగాహన కార్యక్రమాలను సమర్థవంతంగా అమలు చేయడం ద్వారా ప్రజాస్వామ్యంపై ప్రజల్లో నమ్మకం పెంపొందించడంలో జిల్లా ఎన్నికల యంత్రాంగం విశేషంగా కృషి చేసింది. ఈ సందర్భంగా కలెక్టర్ పమేలా సత్పతి మాట్లాడుతూ, "జిల్లా యంత్రాంగం, ఎన్నికల అధికారులు, సిబ్బంది అందరి సమష్టి కృషి వల్లే ఈ అవార్డు సాధ్యమైంది" అని తెలిపారు. ఎన్నికల నిర్వహణలో భాగస్వాములైన ప్రతి ఒక్క అధికారికి అభినందనలు తెలిపారు. ఈ అవార్డు జిల్లా ఎన్నికల యంత్రాంగం ప్రజాస్వామ్య విలువలకు కట్టుబడి, సుశిక్షిత సిబ్బందితో నిష్పక్షపాతంగా ఎన్నికలు నిర్వహించగల సామర్థ్యాన్ని ప్రతిబింబిస్తోందని అధికారులు సంతోషం వ్యక్తం చేశారు.

# ప్రధాన రహదారిపై మీటింగ్‌లా...!

**అనుమతులేలా ఇస్తారు..?**



కరీంనగర్, జనతా న్యూస్ : అల్గునూర్ రాజీవ్ రహదారిపై ఆదివారం కాంగ్రెస్ పార్టీ సమావేశం ఏర్పాటు చేయడంపై తిమ్మాపూర్ మండల బీజేపీ అధ్యక్షులు సుగుర్తి జగదీశ్వరాచారి తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. అల్గునూర్ చౌరస్తాలో ప్రజా సంక్షేమ కార్యక్రమాలు, రాజకీయ పార్టీల అవసరాల కోసం రాస్తా రోఖో లేదా ధర్నాలు నిర్వహించినట్లయితే సుమారు కిలోమీటర్ వరకు ట్రాఫిక్ జాం ఏర్పడుతుందని, ఈ ట్రాఫిక్‌ను నియంత్రించేందుకు అరకొరగా ఉన్న పోలీసులకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతాయని తెలిపారు. ఈ కారణంగానే పోలీసులు ఇటువంటి కార్యక్రమాలకు సాధారణంగా అనుమతులు ఇవ్వకుండా నియంత్రణ చర్యలు తీసుకుంటారని పేర్కొన్నారు. అనుమతి లేకుండా కార్యక్రమాలు నిర్వహిస్తే బాధ్యులపై కేసులు నమోదు చేస్తారని, అయితే ఇదే నిబంధనలు కాంగ్రెస్ పార్టీ నాయకులకు వర్తించవా..? అని ప్రశ్నించారు. ఆదివారం నిర్వహించిన సమావేశానికి సంబంధించి బాధ్యులపై కేసులు నమోదు చేస్తారా? అని కూడా ఆయన సందేహం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ సమావేశానికి సంబంధించి అనుమతుల గురించి పోలీసులను ప్రశ్నించగా, తమకు తెలియదని సమాధానం ఇచ్చినట్లు బీజేపీ అధ్యక్షులు తెలిపారు. త్వరలో జరగబోయే ఎన్నికల నేపథ్యంలో ట్రాఫిక్ జాం వల్ల ప్రజలకు తీవ్ర ఇబ్బందులు కలిగే ప్రాంతాల్లో ఎటువంటి సభలు, సమావేశాలకు అనుమతులు ఇవ్వకూడదని మీడియా ద్వారా అధికార యంత్రాంగాన్ని కోరారు. ప్రజలకు ఇబ్బంది కలిగేలా నడిరోడ్లపై సభలు, సమావేశాలు ఏర్పాటు చేసే కాంగ్రెస్ నాయకుల వ్యవహార శైలిని తీవ్రంగా ఖండిస్తున్నట్లు తన ప్రకటనలో పేర్కొన్నారు.

# డంప్‌యార్డును పూర్తిస్థాయిలో ప్రక్షాళన చేస్తాం

**లెగసీ, ఫ్రెష్ వేస్టు పూర్తిగా తొలగింపుపై కమిషనర్ ప్రఫుల్ దేశాయ్ స్పష్టం**



కరీంనగర్, జనతా న్యూస్ : డంప్‌యార్డులో ఏళ్ల తరబడి పేరుకుపోయిన లెగసీ వేస్టు, అలాగే రోజువారీగా వస్తున్న ఫ్రెష్ వేస్టును పూర్తిస్థాయిలో ప్రక్షాళన చేసేలా నగరపాలక సంస్థ చర్యలు తీసుకుంటుందని మున్సిపల్ కమిషనర్ ప్రఫుల్ దేశాయ్ అన్నారు. కరీంనగర్ నగరపాలక సంస్థ పారిశుధ్య విభాగం ఆధ్వర్యంలో ఆదివారం బైపాస్ రోడ్డులోని డంప్‌యార్డును కమిషనర్ ప్రఫుల్ దేశాయ్ సందర్శించారు. అక్కడ కొనసాగుతున్న బయోమైనింగ్ ప్రక్రియను ఆయన తనిఖీ చేసి పరిశీలించారు. సంబంధిత ఏజెన్సీ ప్రతినిధులు, ఇంజినీరింగ్ అధికారులకు బయోమైనింగ్ విధానంపై పలు సూచనలు చేశారు. ప్రక్రియను వేగవంతంగా కొనసాగిస్తూ పూర్తిస్థాయిలో చెత్తను తొలగించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఆరు నెలల్లో పేరుకుపోయిన చెత్తను పూర్తిగా ప్రక్షాళన చేసేలా తగిన చర్యలు చేపట్టాలని అధికారులను స్పష్టంగా ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డీఈ లచ్చిరెడ్డి, సంబంధిత ఏజెన్సీ ప్రతినిధులు పాల్గొన్నారు.

# హుస్నాబాద్‌ను ఆదర్శంగా తీర్చిదిద్దుతాం

**రూ. 26 కోట్లతో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన**

**గౌరవెల్లిని పూర్తి చేసి నియోజకవర్గాన్ని సస్యశ్యామలం చేస్తాం**

**మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్‌ను ఆశీర్వదించండి**

**మంత్రి పొన్నం ప్రభాకర్**



హుస్నాబాద్, జనత న్యూస్: హుస్నాబాద్ మున్సిపాలిటీని అన్ని రంగాల్లో రాష్ట్రంలోనే అగ్రగామిగా తీర్చిదిద్దుతామని రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ స్పష్టం చేశారు. ఆదివారం ఆయన హుస్నాబాద్ పట్టణంలో పర్యటించి సుమారు 26 కోట్ల రూపాయల వ్యయంతో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేయడంతో పాటు మార్కెట్ యార్డులో కందుల కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ఆయన మాట్లాడుతూ గత పదేళ్లలో జరగని అభివృద్ధిని తాము అధికారంలోకి వచ్చిన రెండేళ్లలోనే చేసి చూపించామని ధీమా వ్యక్తం చేశారు. నియోజకవర్గ ప్రజల చిరకాల ఆకాంక్ష అయిన గౌరవెల్లి ప్రాజెక్టును త్వరితగతిన పూర్తి చేసి హుస్నాబాద్‌ను సస్యశ్యామలం చేస్తామని భరోసా ఇచ్చారు.

## అధునాతన హంగులతో మౌలిక వసతులు

పట్టణ సుందరీకరణతో పాటు రవాణా సౌకర్యాల మెరుగుదలకు తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని మంత్రి పేర్కొన్నారు. హుస్నాబాద్ నుంచి కరీంనగర్ మరియు అక్కన్నపేట వైపు నాలుగు వరుసల రహదారి పనులు శరవేగంగా సాగుతున్నాయని తెలిపారు. విద్యార్థుల భవిష్యత్తు కోసం శాతవాహన యూనివర్సిటీ ఇంజనీరింగ్ కళాశాల శాశ్వత భవనాల నిర్మాణానికి ముఖ్యమంత్రితో శంకుస్థాపన చేయించుకున్నామని, అలాగే 8.5 కోట్ల రూపాయలతో అధునాతన ఆర్టీఏ కార్యాలయం, డ్రైవింగ్ ట్రాక్ నిర్మిస్తున్నామని వెల్లడించారు. 250 పడకల ఆసుపత్రి ద్వారా ప్రజలకు 24 గంటల నాణ్యమైన వైద్య సేవలు అందుబాటులోకి వస్తాయని, పీజీ కళాశాల ఏర్పాటుతో ఈ ప్రాంతం విద్యా హబ్‌గా మారుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

## పర్యాటక ప్రాజెక్టులు,సంక్షేమం

హుస్నాబాద్‌లోని ఎల్లమ్మ చెరువు, కొత్త చెరువుల పునరుద్ధరణకు దాదాపు 10 కోట్ల రూపాయలకు పైగా నిధులు కేటాయించామని, చెరువుల సుందరీకరణతో పాటు అర్బన్ ఫారెస్ట్ ట్రెక్కింగ్, రాయికల్ జలపాతాలను పర్యాటక కేంద్రాలుగా తీర్చిదిద్దుతామన్నారు. పేదల సొంతింటి కల నెరవేర్చేందుకు నియోజకవర్గానికి 3500 ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేశామని, గత ప్రభుత్వం ఒక్క డబుల్ బెడ్ రూమ్ ఇల్లు కూడా ఇవ్వలేదని విమర్శించారు. చౌటపల్లి వద్ద త్వరలోనే ఇండస్ట్రియల్ ప్రాజెక్టు రాబోతుందని, అలాగే హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ సహకారంతో 20 ఎకరాల్లో అంతర్జాతీయ క్రికెట్ స్టేడియాన్ని నిర్మిస్తామని మంత్రి ప్రకటించారు.

## రాజకీయ విమర్శలు.. గెలుపే లక్ష్యం

హుస్నాబాద్‌ను గతంలో సిద్దిపేట జిల్లాలో కలుపుతుంటే అప్పటి ఎమ్మెల్యే సతీష్ బాబు మౌనంగా చూస్తూ ఉండిపోయారని, కానీ తమ ప్రభుత్వం హుస్నాబాద్‌ను తిరిగి కరీంనగర్ జిల్లాలో కలుపుతుందన్న హామీని నెరవేరుస్తుందని మంత్రి పునరుద్ఘాటించారు. తాజాగా జరగబోయే మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని ఆశీర్వదించి 20కి 20 కౌన్సిలర్లను గెలిపించాలని, తద్వారా నియోజకవర్గ అభివృద్ధికి మరింత సహకరించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ సంస్థ చైర్మన్ లింగమూర్తి, మార్కెట్ కమిటీ చైర్మన్ తిరుపతి రెడ్డి, ఆర్డీవో రామ్మూర్తి, మున్సిపల్ కమిషనర్ మల్లిఖార్జున్,నాయకులు బొలిశెట్టి శివయ్య, బంక చందు, వి వెంకటరమణ, చిత్తారి రవీందర్ తదితరులు పాల్గొన్నారు.





# ఓటు హక్కు తప్పక వినియోగించుకోవాలి

**జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎస్. శివకుమార్ పిలుపు**



కరీంనగర్, జనతా న్యూస్ : ప్రజాస్వామ్య దేశంలో సామాన్య పౌరుడి అత్యంత శక్తివంతమైన ఆయుధం ఓటుహక్కు అని, ఎన్నికల వేళ ప్రలోభాలకు లొంగకుండా ప్రతి ఒక్కరూ తప్పక ఓటు హక్కును వినియోగించుకోవాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎస్. శివకుమార్ అన్నారు. జాతీయ ఓటరు దినోత్సవాన్ని పురస్కరించుకుని కలెక్టరేట్ ఆడిటోరియంలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రజాస్వామ్య పరిరక్షణలో పాలకులను ఎన్నుకోవడంలో ప్రతి ఓటు ఎంతో కీలకమని పేర్కొన్నారు. ప్రతి పౌరుడు తన ఓటు హక్కును వినియోగించుకున్నప్పుడే ప్రజాస్వామ్యం మరింత బలోపేతమవుతుందని తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఓటర్ ప్రతిజ్ఞ చేయించారు. ఉత్తమ సేవలు అందించిన ఏఈఆర్‌ఓలు, ఈఆర్‌ఓలు, టెక్నికల్ మేనేజర్లు, బీఎల్వోలులకు జిల్లా ప్రధాన న్యాయమూర్తి చేతుల మీదుగా సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. యువ ఓటర్లకు గుర్తింపు కార్డులు అందజేశారు. పలువురు సీనియర్ సిటిజన్లను శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఓటు హక్కు ప్రాధాన్యతను వివరిస్తూ విద్యార్థులు పలు సాంస్కృతిక ప్రదర్శనలు నిర్వహించారు.

## ర్యాలీని ప్రారంభించిన అడిషనల్ కలెక్టర్

జాతీయ ఓటర్ దినోత్సవం సందర్భంగా జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ స్టేడియం నుంచి భగత్ సింగ్ చౌరస్తా మీదుగా కలెక్టరేట్ వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీని అడిషనల్ కలెక్టర్ లక్ష్మీ కిరణ్ ప్రారంభించారు. "ఓటును మించి ఏది లేదు.. నేను కచ్చితంగా ఓటు వేస్తాను" అనే నినాదంతో ర్యాలీ కొనసాగింది. కరీంనగర్ క్రీడా పాఠశాల విద్యార్థులు, స్కౌట్స్-గైడ్స్ విద్యార్థులు, కలెక్టరేట్, రెవెన్యూ సిబ్బంది, ఇతర శాఖల సిబ్బంది పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ డివిజనల్ అధికారి మహేశ్వర్, జిల్లా క్రీడా శాఖ అధికారి శ్రీనివాస్ గౌడ్, బీసీ సంక్షేమ అధికారి అనిల్ ప్రకాష్, డీవైఎస్ఓ శ్రీనివాస్, జిల్లా యువజన అధికారి రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

# భారతదేశపు మొట్టమొదటి రేడియో విజువల్ ప్రజాప్రసార కార్యక్రమంగా మన్ కీ బాత్

**దేశాభివృద్ధిలో ప్రజలను భాగస్వాములను చేసిన శక్తివంతమైన వేదిక**



కరీంనగర్, జనతా న్యూస్ : భారత ప్రధాని నరేంద్ర మోదీ ప్రతి నెల చివరి ఆదివారం నిర్వహించే మన్ కీ బాత్ కార్యక్రమం భారతదేశపు మొట్టమొదటి రేడియో విజువల్ ప్రజాప్రసార కార్యక్రమంగా నిలిచిందని బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి తెలిపారు. ఆదివారం ప్రసారమైన మన్ కీ బాత్ 130వ ఎపిసోడ్ను హుజురాబాద్ మండలంలోని ఉప్పల నర్సింగాపూర్ గ్రామంలో స్థానిక బీజేపీ శ్రేణులతో కలిసి గంగాడి కృష్ణారెడ్డి వీక్షించారు. ప్రోగ్రాం అనంతరం ఆయన మాట్లాడుతూ, 2014 అక్టోబర్ 3న విజయదశమి రోజున ప్రారంభమైన ఈ కార్యక్రమం సామాన్య ప్రజలతో నేరుగా సంభాషించడానికి, దేశాభివృద్ధిలో పౌరులను భాగస్వాములను చేయడానికి ఒక శక్తివంతమైన వేదికగా మారిందన్నారు. ఈ ప్రసంగం ప్రతి నెల చివరి ఆదివారం ఉదయం 11 గంటలకు ఆల్ ఇండియా రేడియో, దూరదర్శన్ ద్వారా ప్రసారమవుతుందని, హిందీతో పాటు పలు జాతీయ, ప్రాంతీయ భాషల్లో ప్రజలకు చేరువవుతుందని తెలిపారు. మన్ కీ బాత్‌లో ప్రధాని మోదీ ప్రస్తావించిన అంశాలను వివరిస్తూ, జనవరి 26న రాజ్యాంగ నిర్మాతలకు నివాళులర్పించే అవకాశాన్ని దేశం పొందుతోందని, అంతర్జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా యువతలో ఓటింగ్‌పై అవగాహన పెంచాల్సిన అవసరాన్ని ప్రధాని మోదీ తెలియజేశారని అన్నారు. మొదటిసారిగా ఓటరుగా మారిన యువతను సమాజం గౌరవించడం ద్వారా ప్రజాస్వామ్య విలువలు బలోపేతం అవుతాయని చెప్పారు. భారతదేశం ప్రపంచంలోనే మూడవ అతిపెద్ద స్టార్ట్-అప్ ఎకోసిస్టంగా ఎదిగిందని, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, స్పేస్, సెమీకండక్టర్లు, గ్రీన్ ఎనర్జీ వంటి రంగాల్లో భారతీయ స్టార్ట్-అప్స్ విశేషంగా ముందుకు సాగుతున్నాయని తెలిపారు. భారతీయ ఉత్పత్తులకు ప్రపంచవ్యాప్తంగా నాణ్యత గుర్తింపు రావాలనే లక్ష్యంతో ప్రధాని మోదీ పిలుపునిచ్చారని పేర్కొన్నారు. అలాగే వచ్చే నెలలో జరగనున్న ఇండియా ఏఐ ఇంపాక్ట్ సమ్మిట్ భారతదేశం సాధించిన సాంకేతిక పురోగతిని ప్రపంచానికి చాటిచెప్పే వేదికగా నిలవనుందని గంగాడి కృష్ణారెడ్డి తెలిపారు.

# శ్రీ వెంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాల్లో రథసప్తమి వేడుకలు



## సూర్యప్రభ వాహనసేవలో పాల్గొన్న మంత్రి పొన్నం ప్రభాకర్

కరీంనగర్ జిల్లా, జనతా న్యూస్ : కరీంనగర్ మార్కెట్‌లోని శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయంలో జరుగుతున్న 9వ వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా రథసప్తమి సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారి సూర్యప్రభ వాహనసేవలో రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి, మున్సిపల్ కమిషనర్ ప్రఫుల్ దేశాయ్, కరీంనగర్ పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు అంజన్ కుమార్, అర్బన్ బ్యాంక్ చైర్మన్ కర్ర రాజశేఖర్తో పాటు ఇతర నేతలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ, కరీంనగర్ పాత మార్కెట్‌లోని శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయంలో జరుగుతున్న బ్రహ్మోత్సవాలు ఘనంగా కొనసాగుతున్నాయని తెలిపారు. గతంలో ప్రారంభించిన ఈ కార్యక్రమాలను ప్రభుత్వం కొనసాగిస్తుందని చెప్పారు. రాజకీయాలకు అతీతంగా ఈ ఉత్సవాలు జరుగుతున్నాయని పేర్కొన్నారు. తిరుమల తిరుపతి దేవస్థానం, దాతల సహకారంతో పూజలు, హోమాలు, అన్నదాన కార్యక్రమాలు కొనసాగుతున్నాయని తెలిపారు. సమ్మక్క--సారలమ్మ జాతర సందర్భంగా రవాణా శాఖ తరఫున అన్ని ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. ఉత్తర తెలంగాణలోని కరీంనగర్, వరంగల్, నిజామాబాద్, ఆదిలాబాద్ జిల్లాల పరిధిలోని 51 కేంద్రాల నుంచి బస్సులు ఏర్పాటు చేశామని, జాతర కోసం ఆర్టీసీ 4 వేల బస్సులు నడుపుతున్నట్లు చెప్పారు. ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణం సురక్షితమని, భక్తులు ఆర్టీసీ సేవలను వినియోగించుకోవాలని సూచించారు. గద్దెల వరకు బస్సులు వెళ్లేలా ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. జాతరకు వచ్చే పిల్లలు తప్పిపోకుండా ఉండేందుకు పోలీస్ శాఖ క్యూఆర్ కోడ్ విధానం తీసుకువచ్చిందని, భక్తులు అందరూ ఉపయోగించుకోవాలని సూచించారు.

ఫోన్ ట్యాపింగ్ అంశంపై మాట్లాడుతూ, ప్రభుత్వం ఎవరిపైనా కక్షపూరితంగా వ్యవహరించడం లేదని, చట్టం తన పని తాను చేసుకుంటూ పోతుందని అన్నారు. మున్సిపల్ ఎన్నికల రిజర్వేషన్ల విషయంలో ప్రభుత్వం, ప్రజాప్రతినిధుల ప్రమేయం ఉండదని స్పష్టం చేశారు. గతంలో రిజర్వేషన్ల మార్పులు జరిగాయని ఆరోపణలు ఉన్నాయని, ఇప్పుడు అలాంటి పరిస్థితి ఉండదని తెలిపారు. అభ్యర్థుల ఎంపిక పారదర్శకంగా జరుగుతుందని, మున్సిపల్ ఎన్నికల్లో అందరూ సమన్వయంతో పని చేయాలని పేర్కొన్నారు.

# మంచినీటి పైప్‌లైన్ నిర్మాణానికి భూమి పూజ

కరీంనగర్, జనతా న్యూస్ : కరీంనగర్ నగరంలోని 45వ డివిజన్ మంకమ్మ తోట, రోడ్డు నంబర్--4లో రూ.7 లక్షల సాధారణ నిధులతో చేపట్టనున్న 300 మీటర్ల మంచినీటి పైప్‌లైన్ నిర్మాణానికి ఆదివారం మాజీ మంత్రి, కరీంనగర్ ఎమ్మెల్యే గంగుల కమలాకర్ భూమి పూజ చేశారు. ప్రారంభోత్సవానికి వచ్చిన ఎమ్మెల్యే గంగులకు డివిజన్ వాసులు స్వాగతం పలికారు. అనంతరం కొబ్బరికాయ కొట్టి పనులను ప్రారంభించారు. పనులు నాణ్యతతో, నిర్ణీత సమయంలో పూర్తయ్యేలా చూడాలని కాంట్రాక్టర్‌కు సూచించారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్లు దిండిగాల మహేశ్, గుగ్గిళ్ల జయశ్రీ--శ్రీనివాస్, మైనారిటీ నగర శాఖ అధ్యక్షుడు సౌకత్ అలీ, అర్బన్ బ్యాంక్ మాజీ డైరెక్టర్ కర్ర సూర్యశేఖర్, సుడా మాజీ డైరెక్టర్ నేతి రవివర్మ, నాయకులు మెతుకు సత్యం, బీఆర్‌ఎస్ పార్టీ యువజన విభాగం ప్రతినిధులు వొడ్నాల రాజు, ఎడబోయిన శ్రీనివాస్ రెడ్డి, రవీందర్, శ్రీనివాస్, మిడిదొడ్డి నవీన్, నందెల్లి చిన్న, మహేష్, అంజలితో పాటు డివిజన్ వాసులు తదితరులు పాల్గొన్నారు.



# కాంగ్రెస్‌లోకి వలసల జోరు

## హస్తం తీర్థం పుచ్చుకుంటున్న విపక్ష నేతలు

## కాంగ్రెస్‌తోనే అభివృద్ధి సాధ్యం



పెద్దపల్లి, జనతా న్యూస్ : 25 జనవరి 2026 పెద్దపల్లి నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీలోకి వలసలు కొనసాగుతున్నాయి. పెద్దపల్లి మున్సిపల్ పరిధిలోని పలు వార్డులకు చెందిన విపక్ష నేతలు, కార్యకర్తలు కాంగ్రెస్ పార్టీలో చేరారు. 31వ వార్డుకు చెందిన మంథని నర్సింగ్, 20వ వార్డుకు చెందిన బండి అనిల్‌తో పాటు ఆయా వార్డులకు చెందిన పలువురు నాయకులు, కార్యకర్తలు, అలాగే 25వ వార్డుకు చెందిన పలువురు ముస్లిం మైనారిటీ సోదరులు, సోదరీమణులు కలిపి సుమారు 150 మందికి పైగా కాంగ్రెస్ పార్టీలో చేరినట్లు పార్టీ వర్గాలు తెలిపాయి. పెద్దపల్లి క్యాంపు కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే విజయరమణ రావు వారికి పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో ప్రభుత్వం ఏర్పడిన తర్వాత రాష్ట్రంలో పలు సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు అమలవుతున్నాయని తెలిపారు. గత ప్రభుత్వ అప్పులను చెల్లిస్తూనే హామీల అమలు కొనసాగుతోందని చెప్పారు.

పెద్దపల్లి పట్టణంలో అభివృద్ధి పనులు కొనసాగుతున్నాయని, బస్సు డిపో, బైపాస్ రోడ్డు, ప్రభుత్వ ఆసుపత్రి ఆధునీకరణ, నూతన కోర్టు భవనం వంటి పనులు ప్రణాళికలో ఉన్నాయని పేర్కొన్నారు. ఉచిత బస్సు ప్రయాణం, 200 యూనిట్ల ఉచిత విద్యుత్, ఆరోగ్యశ్రీ, సన్నబియ్యం, రేషన్ కార్డులు వంటి పథకాలు అమలవుతున్నాయని తెలిపారు. రానున్న మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను గెలిపించాలని పార్టీ శ్రేణులు పిలుపునిచ్చాయి. ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్లు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

# మేడారం జాతరకు భక్తులకు ఆర్టీసీ ప్రత్యేక సేవలు

## పెద్దపల్లి నుంచి 175 బస్సుల ఏర్పాటు

## మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం వర్తింపు

## సేవలను ప్రారంభించిన పెద్దపల్లి ఎమ్మెల్యే విజయ రమణారావు




పెద్దపల్లి, జనతా న్యూస్ : మేడారం సమ్మక్క--సారలమ్మ జాతరకు వెళ్లే భక్తులకు పెద్దపల్లి నుంచి మెరుగైన రవాణా సౌకర్యాలు కల్పిస్తూ ఆర్టీసీ ప్రత్యేక సేవలు అందిస్తున్నట్లు పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయ రమణారావు తెలిపారు. భక్తుల ప్రయాణ సౌకర్యాల కోసం పెద్దపల్లి నుంచి మేడారం జాతరకు 175 ఆర్టీసీ బస్సులు ఏర్పాటు చేసినట్లు ఆయన పేర్కొన్నారు. ఆదివారం జాతర ప్రత్యేక బస్సు సేవలను ఎమ్మెల్యే విజయ రమణారావు ఆర్టీసీ అధికారులు, కాంగ్రెస్ నాయకులతో కలిసి అధికారికంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, జిల్లా ప్రజల చిరకాల వాంఛ అయిన పెద్దపల్లిలో బస్సు డిపో ఏర్పాటుకు చర్యలు తీసుకున్నామని, డిపో పనులు శరవేగంగా కొనసాగుతున్నాయని తెలిపారు. అతి త్వరలోనే డిపోను ప్రారంభిస్తామని చెప్పారు. మేడారం జాతరకు వెళ్లే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా డిపో వద్ద ఎక్కువ సంఖ్యలో బస్సులు అందుబాటులో ఉంచామని పేర్కొన్నారు. భక్తులు ఆర్టీసీ సేవలను సద్వినియోగం చేసుకోవాలని కోరుతూ, ఆర్టీసీ ప్రయాణం సురక్షితమైందని తెలిపారు. జాతరకు వెళ్లే మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం వర్తిస్తుందని ప్రకటించారు. పెద్దపల్లి నుంచి నేరుగా మేడారం జాతరకు ప్రత్యేక బస్సులు నడుపుతున్నట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో ఆర్టీసీ అధికారులు డీవై ఆర్ఎం భూపతి రెడ్డి, డీఎం కల్పన, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# పెద్దపల్లి మున్సిపల్‌లో రూ.16.80 కోట్లతో అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు

## కాంగ్రెస్ ప్రభుత్వంలోనే పెద్దపల్లి పట్టణ అభివృద్ధి

## మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు ప్రజలు పట్టం కట్టాలి

## పిలుపునిచ్చిన పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణ రావు



పెద్దపల్లి, జనతా న్యూస్ : పెద్దపల్లి మున్సిపల్ పరిధిలో రూ.16.80 కోట్ల రూపాయల నిధులతో చేపట్టనున్న పలు అభివృద్ధి కార్యక్రమాలకు పెద్దపల్లి శాసనసభ్యులు చింతకుంట విజయరమణ రావు శంకుస్థాపనలు చేశారు. పెద్దపల్లి పట్టణంలోని పలు వార్డుల్లో సీసీ రోడ్లు, డ్రైనేజీ, బీటీ రోడ్ల నిర్మాణాలకు నిధులు కేటాయించి పనులు ప్రారంభించగా, స్థానిక నాయకులు, అధికారులు ఈ కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే విజయ-రమణ రావు మాట్లాడుతూ, గత ప్రభుత్వంలో పెద్దపల్లి అభివృద్ధి నిర్లక్ష్యం చేయబడిందని విమర్శించారు. తాను ఎమ్మెల్యేగా ఎన్నికైన తర్వాత మున్సిపల్ పరిధిలో ఇప్పటికే భారీగా అభివృద్ధి పనులు చేపట్టామని, ప్రస్తుతం మరిన్ని నిధులు మంజూరయ్యాయని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలోనే పెద్దపల్లి పట్టణం శరవేగంగా అభివృద్ధి చెందుతోందని, ప్రజలకు సమన్యాయం చేస్తూ అన్ని వార్డుల్లో సమగ్ర అభివృద్ధి కార్యక్రమాలు అమలు చేస్తున్నామని అన్నారు. భవిష్యత్తులో కూడా పెద్దపల్లి అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తానని హామీ ఇచ్చారు. మున్సిపల్ ఎన్నికల్లో ప్రజలందరూ కాంగ్రెస్ పార్టీకి మద్దతు ఇచ్చి పార్టీ జెండాను ఎగరవేయాలని ఎమ్మెల్యే విజయరమణ రావు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్, మున్సిపల్ అధికారులు, మాజీ కౌన్సిలర్లు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, పలు వార్డుల మహిళలు తదితరులు పాల్గొన్నారు.

# మాజీ కార్పొరేటర్ జివి రమణ ఆధ్వర్యంలో క్రికెట్ పోటీలు ప్రారంభం



కరీంనగర్, జనతా న్యూస్ : కరీంనగర్ పట్టణం అశోక్ నగర్‌లో మాజీ కార్పొరేటర్ గొట్టెముక్కుల ఉమారాణి వెంకటరమణ ఆధ్వర్యంలో ఆదివారం క్రికెట్ పోటీలు ఘనంగా ప్రారంభమయ్యాయి. డివిజన్‌లోని యువత క్రీడల్లో ముందుకు రావాలనే ఉద్దేశంతో ఈ క్రికెట్ పోటీలను నిర్వహిస్తున్నట్లు ఉమారాణి వెంకటరమణ తెలిపారు. యువతలో క్రీడాభిరుచి పెంపొందించడమే లక్ష్యంగా ఈ పోటీలు నిర్వహిస్తున్నామని చెప్పారు. క్రీడల్లో గెలుపొందిన జట్లను ప్రోత్సహించేందుకు తగిన బహుమతులు కూడా అందజేయనున్నట్లు ఈ సందర్భంగా తెలిపారు. యువత క్రీడల్లో చురుగ్గా పాల్గొని ప్రతిభను చాటాలని ఆయన కోరారు.

EDITED, PRINTED PUBLISHED AND OWNED BY YAMSANI SHIVA KUMAR, PRINTED AT SRI BALAJI PRINTING PRESS, H.NO : 4-4-85, KARIMNAGAR-504001 DISTRICT TELANGANA PUBLISHED AT H.NO:6-2-7A, HANMANWADA, JAGITYAL, VIL & MDL.DIST.KARIMNAGAR 506327 EDITOR : YAMSANI SHIVA KUMAR RNI NO: TELTEL/2014/55206, CELL NO: 79-89867251 Email: janathadaily@gmail.com